
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 18.03.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 42 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# నువ్వింత తిన్నావ్.. నువ్వంత తిన్నావ్...!

- దొంగలు దొంగలు లెక్కలు చెప్పుకున్నట్లుంది తప్ప ప్రజావసరాల కోసం అసెంబ్లీ పెట్టినట్లు లేదు.
- అవినీతి సామ్రాట్టుల సవాళ్ళతో అభాసుపాలౌతున్న అసెంబ్లీ సమావేశాలు

**తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో బడ్జెట్ ప్రవేశపెట్టే ముందురోజు సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని చూస్తే భలే ఆశ్చర్యమేసింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సమయంలో ఆంధ్రావాళ్లను తన్నండి, నరకండి, చంపండి... అన్న కేసీఆర్ ఇతనేనా అనిపించింది. ప్రతి సమస్య మీద ఆయన వివరణ ఇచ్చిన తీరు ప్రతిపక్ష సభ్యులను సైతం నోరెత్తకుండా చేసింది. కేవలం ఆయన తెలంగాణ అభివృద్ధి గురించి, సమస్యల గురించి మాత్రమే ఎంతో చక్కగా మాట్లాడారు. వివాదాల జోలికే పోలేదు. ఖబడ్దార్, నీ అంతు చూస్తా, మీ లెక్క తేలుస్తా, బుద్ధుందా... సిగ్గుందా... వంటి పదాల జోలికే పోలేదు. ప్రశ్నలకు చాలా పద్ధతిగా వివరణ ఇచ్చాడు. చేయలేని పనులను కూడా ఎందుకు చేయలేకపోతున్నామో అర్థమయ్యేలా వివరించాడు.**

రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ చేతుల్లోపడి తెలంగాణ సర్వనాశనమైపోతుంది, తెలంగాణ అసెంబ్లీలో తన్నుకోవడానికే సరిపోతుంది, చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ మాత్రం దేదీప్యమానంగా వెలిగిపోతుందనుకున్నారు. తీరాచూస్తే సీన్ రివర్సయ్యింది. తెలంగాణ సిఎం కేసీఆర్ వాస్తవిక కోణంలో అభివృదిధ వైపు పయనిస్తుండగా, మన ప్రభుత్వం మాత్రం ఎడారిలో ఒయాసిస్‌ల కోసం అన్వేషణ సాగిస్తోంది.

అభివృద్ధి అంటే ఎలాగూ లేదు. అసెంబ్లీ సమావేశాలన్నా శుద్ధంగా నిర్వహిస్తున్నారా అంటే అదీ లేదు. అసెంబ్లీ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం అట్టర్‌ఫ్లాప్ అవుతోంది. ముఖ్యంగా కోడెల శివప్రసాద్‌ను ఇష్టంలేని స్పీకర్ సీట్లో కూర్చోబెట్టారు. ఆ పదవిలో కుదురుకోవడానికి ఆయనకు కష్టంగా వుంది. 1983 నుండి కూడా తెలుగుదేశం నాయకుడిగా అలవాటైన ప్రాణం. ఈరోజు పార్టీ పక్షపాతాన్ని వదిలేసి తటస్థంగా ఉండాలంటే కుదురుతుందా? సభలో ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కే ప్రయత్నాలు నిరాటంకంగా జరిగిపోతున్నాయి. చివరకు సుప్రీంకోర్టు కూడా ఏపి శాసనసభ వ్యవహారాలలో జోక్యం చేసుకోవాల్సి వచ్చిందంటే నిర్వాకం ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవచ్చు. సభలో సభ్యులు శృతిమించి ప్రవర్తించినప్పుడు ఒకట్రెండురోజులు సస్పెండ్ చేయడం చూసాం, లేదా ఆ సమావేశాల వరకు సస్పెండ్ చేయొచ్చు. కాని, వైకాపా ఎమ్మెల్యే రోజాను మాత్రం ఏడాది కాలం సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. ఏపి అసెంబ్లీ అధికారయంత్రాంగంపై సుప్రీం అక్షింతలు చల్లింది. రోజాపై విధించిన ఏడాది కాలం సస్పెన్షన్‌ను కోర్టు కొట్టేసింది.

ఇక బడ్జెట్ సమావేశాలు చూస్తే... ఛీఛీ... ఇదేనా మన అసెంబ్లీ అనిపించేంత రోతగా జరుగుతున్నాయి. సభలో అరుపులు, బెదిరింపులు తప్ప అభివృద్ధి, ప్రజా సమస్యల గురించి చర్చలేవి? ఎంతో సంయమనం పాటించి, దూకుడుగా వుండే ప్రతిపక్ష సభ్యులకు సైతం శాంతంగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రే ఖబడ్దార్, మీ అంతు చూస్తాం... అంటూ ఆవేశంగా మాట్లాడుతుంటే, ఇక అర్థవంతమైన చర్చలకు ఆస్కారమెక్కడుంటుంది. ప్రతిపక్ష సభ్యులు చేసే అవినీతి ఆరోపణలకు నేరుగా సమాధానం చెప్పకుండా అధికారపార్టీ సభ్యులు ఎదురు దాడికి దిగుతుండడం, చర్చను పక్కదారి పట్టిస్తుంది. (మిగతా 11వ పేజీలో)



# సుజనా ఔట్ జయదేవ్ ఇన్?



కేంద్ర కేబినెట్‌లో త్వరలో మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎన్డీఏ ప్రభుత్వం మన రాష్ట్రం నుండి ఇద్దరు మంత్రులుగా వున్నారు. ఒకరు అశోక్ గజపతిరాజు కాగా, రెండో మంత్రి సుజనాచౌదరి. అశోక్ గజపతిరాజు మీద ఎటువంటి వివాదాలు లేవు. అవినీతి ఆరోపణలు లేవు. పెద్దమనిషి. ఆయన వల్ల కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి తలనొప్పులు లేవు. వచ్చిన సమస్యల్లా సుజనాచౌదరితోనే! సుజనాచౌదరి కంపెనీలకు సంబంధించినవిగా చెబుతున్న మారిషస్ బ్యాంకు 3వేల కోట్లు అప్పుపై పెద్ద దుమారం రేగుతోంది. కేంద్ర కేబినెట్‌లోని ఓ సభ్యుడే ఇన్ని వేల కోట్లు బకాయిపడ్డాడనే ఆరోపణలు ఎన్డీఏకు పెద్ద సమస్యగా మారాయి. ఇప్పటికే విజయ్‌మాల్యా అప్పులపై పెద్ద దుమారం రేగింది. అయితే మాల్యా తమ పార్టీ ఎంపీ గాని తమ మిత్రపక్షాల ఎంపీగాని కాకపోవడంతో బీజేపీ నాయకులు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే, సుజనా (మిగతా 11వ పేజీలో)

## పాశంకు 'దేశం' వల?

11లో



## ముదురుతున్న అనుమానాలు



# మహిళలపై దాడులు అరికట్టండి

## - ఎస్పీకి జిల్లా మహిళా కాంగ్రెస్ వినతి



మహిళలపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నెల్లూరుజిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్ళపల్లి అరుణమ్మ కోరారు. బుధవారం జిల్లా ఎస్పీ విశాల్ గున్నీని అరుణమ్మతో పాటు నాయకురాళ్లు పోలీసు అతిథి గృహంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ మహిళా పోలీస్‌స్టేషన్ పనితీరు అధ్వాన్నంగా మారిందని, అక్కడ పని చేస్తున్న కొంతమంది సిబ్బంది నిందితులకు కొమ్ము కాస్తూ బాధితులకు న్యాయం చేయడం లేదన్నారు. రాజకీయ సిఫార్సులతో అనేక కేసులు పోలీసుస్టేషన్లలో బుట్ట దాఖలవుతున్నాయన్నారు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారిందని దీనిపై దృష్టిపెట్టి తగుచర్యలు తీసుకోవాలని కోరారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌ను అరికట్టి విద్యాసంస్థల్లో విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో అనూరాధ, పద్మావతమ్మ, పార్వతి, వరలక్ష్మి, శృతి, భాగ్యమ్మ, ప్రసూన పాల్గొన్నారు.

# ఆర్యక్షత్రియులకు న్యాయం చేయండి



ఆర్యక్షత్రియులగు తమను నాకాష్, చిత్తారి, జీనిగిరి అని ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్క పేరుతో పిలుస్తుంటారని, బిసి(బి) గ్రూపుకు చెందిన తాము ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే బిసి(బి) గ్రూపులో తమ ఆర్యక్షత్రియ కులము గాని, సబ్‌కులాలుగాని లేవని, తమ కులంను ఆన్‌లైన్‌లో చేర్చాలంటూ ఆ సంఘం నాయకులు నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకికి వినతిపత్రం సమర్పించారు. తమ కులానికి బిసి(బి) గ్రూపు సర్టిఫికేటు ఇచ్చేందుకు మండలాధికారులు సందేహిస్తున్నారని, బిసి(బి) గ్రూపు సర్టిఫికేట్లు అధికారులు జారీ చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కలెక్టర్‌ను సంఘం అధ్యక్షులు నందిగం చంద్రశేఖర్‌వర్మ, సభ్యులు అభ్యర్థించారు.

# రహదారి కోసం అడ్డదారి!

## • ముంబై రోడ్డు పనులు ముమ్మరం



నెల్లూరు నుండి నెల్లూరుపాలెం వరకు ముంబై జాతీయ రహదారిని సిమెంట్ రోడ్డుగా నిర్మిస్తున్నారు. ఈమేరకు నెల్లూరు - నెల్లూరుపాలెం మధ్య రోడ్డు విస్తరణ, వంతెనల విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు మట్టి పని జరిగింది. బుచ్చి, నెల్లూరుపాలెం మధ్య బస్సుల్లో, లారీల్లో పోతుంటే ఎర్ర ధుమ్ము వచ్చి ప్రయాణీకుల ఒంటికి అతుక్కుపోతుంది. ఇప్పుడింకా ఎండలు. ఒక బండి ముందు పోతుంటే రేగే ధుమ్ముకు వెనుకబండిలో డ్రైవర్‌కు దారి కూడా కనిపించదు. నీళ్లు కొట్టినా పది నిముషాలే! ఈ ఎండలకు ఎన్ని నీళ్లు కొట్టినా ధుమ్ము లేవకుండా ఆపడం కష్టం. తొందరగా ఈ రోడ్డును పూర్తి చేస్తే ఈ బాధలు తగ్గుతాయని ప్రయాణీకులు వాపోతున్నారు.

ఈ నేపథ్యంలో ఒక నెలరోజుల్లో సంగం - నెల్లూరుపాలెంల మధ్య రోడ్డును పూర్తి చేయాలని రోడ్డు కాంట్రాక్టర్లు, ఆర్ అండ్ బి అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం ఈ రోడ్డు మీద నుండి ట్రాఫిక్‌ను హసనాపురం, ఏ.ఎస్‌పేటల మీదుగా ఆత్మకూరు వైపుకు మళ్లించనున్నారు. ఆత్మకూరు వైపు వెళ్లే వాహనాలు సంగం చెక్‌పోస్ట్ నుండి హసనాపురం, ఏ.ఎస్.పేట మీదుగా నెల్లూరుపాలెం సమీపంలోని నరసాపురం వద్ద ముంబై రోడ్డులోకి వస్తాయి. ఆత్మకూరు వైపు నుండి సంగంకు వచ్చే వాహనాలు కూడా ఇదే రూటులో రావాలి. గత ఏడాది నవంబర్‌లో కురిసిన వర్షాలకు వాసిలి వద్ద రోడ్డు తెగినప్పుడు కూడా ప్రత్యామ్నాయంగా ఏ.ఎస్.పేట రోడ్డునే వాడడం జరిగింది. ఒక నెల రోజులు ఓపిక పట్టి ఈ రూట్లో ప్రయాణాలు సాగిస్తే సంగం - నెల్లూరుపాలెం మధ్య మంచి రోడ్డు వస్తుంది.

సింహపురి సమాచారం

## చిల్డ్రన్స్ పార్క్ దగ్గర

# విజయా డెయిరీ పార్లర్

నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో విజయా డెయిరీ ఉత్పత్తుల విక్రయ దుకాణాన్ని 16వ డివిజన్ కార్పొరేటర్ బాల కోటేశ్వరరావు, డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయ డెయిరీ ద్వారా వినియోగదారులకు ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ పెరగడంతో రెండవ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విజయా డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ మోహన్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి

అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితచరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని నెల్లూరు డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ కోరారు. బుధవారం నెల్లూరు శెట్టిగుంటరోడ్డులోని వైవిఎం పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. నెల్లూరు జేసిఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ద్వారకానాథ్ మాట్లాడుతూ రాష్ట్రాలు విడిపోయినప్పటికి తెలుగుజాతి ఉన్నంతవరకు శ్రీరాములు ప్రజల హృదయాల్లో ఉంటారన్నారు. జేసిఐ అధ్యక్షుడు వి.ఈశ్వరమురళి, కార్యదర్శి చరణ్‌కుమార్, బి.జనార్ధన్‌రావు, విగ్రహదాతలు పువ్వాడి వెంకటసునీల్‌కుమార్, జనార్ధన్, రాజాగిరీష్, కొల్లు ప్రసన్న, శ్రీనివాసులు, సివి శరత్‌కుమార్, వివేకానంద, భాస్కర్ పాల్గొన్నారు.




కీ॥ శే॥ వేనాటి వనమ్మ గారు
W/o లేట్ శ్రీ వేనాటి సుబ్బారెడ్డి
మరణం : 29.2.2016

# ఉత్తరక్రియలు

మా ఇంటి దైవం, మా తల్లి గారైన
## కీ॥శే॥ వేనాటి వనమ్మ గారు
(కీ॥శే॥ వేనాటి సుబ్బారెడ్డి గారి ధర్మపత్ని)
ఫిబ్రవరి 29, 2016 సోమవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో...

కుమారులు : కీ॥శే॥ వేనాటి మునిరెడ్డి, మాజీ NDCCB ఛైర్మెన్ - వసంతమ్మ
వేనాటి రామచంద్రారెడ్డి, ZP ఫ్లోర్ లీడర్ - విజయలక్ష్మి

మనుమళ్ళు : వేనాటి సురేష్‌రెడ్డి - నిషిత, వేనాటి సతీష్‌రెడ్డి - నిషిత
వేనాటి సుమంత్‌రెడ్డి - వైష్ణవి, వేమిరెడ్డి సందీప్‌రెడ్డి - శ్వేత

మునిమనుమళ్ళు - ముని మనుమరాండ్రు
ముని నవ్య, ముని సర్వేష్, సాయి స్మరన్, నేత్ర, కార్తీక్, ప్రేక్ష, వర్షిత

పెద్దకర్మ : తేది 19-3-2016 శనివారం దొరవారిసత్రం (మం), మావిళ్ళపాడు గ్రామంలోని మా స్వగృహం నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

● చదువు, సంస్కారం ఇంతేనా?

# స్వచ్ఛభారత్ ఇదేనా...?

## యువతరం మారాలి...



చదువు విజ్ఞానాన్ని, విషయాన్నే కాదు సంస్కారాన్ని కూడా నేర్పాలి. ఐఏఎస్ చదివిన సంస్కారహీనుడి కంటే కూడా ఏమీ చదవకున్నా సంస్కారవంతుడిని ఈ సమాజం గౌరవిస్తుంది. ప్రతి విద్యార్థి చదువుతో పాటు సంస్కారాన్ని కూడా వంటబట్టించుకుంటున్నప్పుడే అతని భవిష్యత్‌తో పాటు ఈ దేశ భవిష్యత్ కూడా బాగుంటుంది.

ఓ పక్క 'స్వచ్ఛభారత్' అంటూ ప్రధాని నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. మీ వంటిని, మీ ఇంటినే కాదు మీ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోండంటూ టీవీలలో, రేడియోలలో చెబుతున్నారు. పెద్దగా చదువు, సంధ్య లేనోళ్లు కూడా ఈరోజు స్వచ్ఛభారత్ ప్రచారంతో అవగాహన పొందారు. చేతిలోని చెత్తను ఎక్కడంటే అక్కడ పడేయకుండా చెత్తబుట్టల్లో వేస్తున్నారు. మరి విద్యాధికులు కానివాళ్లే 'స్వచ్ఛభారత్' పట్ల ఇంత బాధ్యతగా స్పందిస్తుంటే మరి చదువుకుంటున్న విద్యార్థులు ఇంకెంత బాధ్యతగా ఉండాలి.

కాని చాలామంది విద్యార్థులలో ఆ బాధ్యత కనిపించడం లేదు. సరస్వతీ దేవికి ప్రతిరూపం చదివే పుస్తకాలు. వాటిని చాలా పవిత్రంగా చూస్తాం. కాని మొన్న ఇంటర్మీడియట్ పరీక్షలు అయిపోయాయో లేదో విద్యార్థులు పుస్తకాలలోని పేజీలను ముక్కలు ముక్కలుగా చింపి రోడ్ల మీద ఎగరేసుకుంటూ పోయారు. ఏం పద్ధతి ఇది. విద్యాలయాల్లో వీళ్లకు నేర్పించిన చదువు ఇదేనా? సంస్కారం కొంతన్నా నేర్పరా? డబ్బులు పెట్టి కొన్న పుస్తకాలను చించిపారేసే బదులు బీద, బిక్కి విద్యార్థులకిస్తే వాడుకుంటారుగా! ఈ పుస్తకాలు చించడం ఒక జాడ్యం. పరీక్షలు అయిపోయాయన్న ఆనందంలో కేరింతలు కొట్టొచ్చు. కాని పుస్తకాలు చించడమేంటి? అదొక తప్పయితే, చించిన పుస్తకాల కాగితాలను రోడ్లమీద వేసి స్వచ్ఛభారత్ స్ఫూర్తిని నీరుగారుస్తున్నారు. ఈ పద్ధతే మంచిది కాదు. కాలేజీలు, స్కూల్స్ యాజమాన్యాలు దీని గురించి ఆలోచించాలి. పిల్లలకు ఈ విషయం గురించి చెప్పడానికి ఓ పది నిముషాలు చాలు. ఎప్పుడూ మార్కుల మీదే కాదు, విద్యార్థులలో కొంచెం సంస్కారం పెంపొందించేలా కూడా విద్యాబోధన జరగాలి.

## ఎస్పీని కలిసిన బొమ్మిరెడ్డి



జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఈ నెల 15వ తేదీ జిల్లా ఎస్పీ విశాల్ గున్నీని కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని, రాజకీయ కక్షలు, కార్పణ్యాలకు చోటు లేకుండా చూడాలని, అక్రమ కేసులను నివారించాలని ఈ సందర్భంగా ఆయన ఎస్పీని కోరారు.

# హమ్మయ్య.. నెల్లూరులో రెండు ఫ్లై ఓవర్లు!

ఎట్టకేలకు నెల్లూరు నగరంలో రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయి. ఒకటి కొండాయపాలెం రైల్వేగేటు మీదుగా, రెండోది బి.వి.నగర్ రైల్వేగేటు మీదుగా! 105కోట్లతో ఈ రెండు వంతెనలను కట్టనున్నారు. జిఎన్‌టి రోడ్డు నుండి రైల్వే ట్రాక్ మీదుగా మినీబైపాస్‌కు కలిసే విధంగా ఈ రెండు వంతెనలను నిర్మించబోతున్నారు. ఈమేరకు ఈ రెండు వీధులలో ఆక్రమణలను తొలగించనున్నారు.

ఈ రెండు ఫ్లైఓవర్‌లు పూర్తయితే కరెంట్ ఆఫీసు సెంటర్, బి.వి.నగర్, ఎన్‌జిఓ కాలనీ, కొండాయపాలెం వాసులకు రైల్వేగేట్ల కష్టాలు తగ్గుతాయి. అన్నింటికంటే ముఖ్యంగా వర్షాల సీజన్‌లో వాహనాల రాకపోకలకు ఈ ఫ్లైఓవర్ వంతెనలు బాగా ఉపయోగపడతాయి. నగరంలో అయ్యప్పగుడి వద్ద తప్పితే ఒక్క రైల్వే ఓవర్ బ్రిడ్జి కూడా లేదు. నగరం మధ్యలో నుండి రైల్వేట్రాక్ పోతుంది. ఈ ట్రాక్‌కు తూర్పు, పడమరల వైపున నగరం విస్తరించి వుంది. ఈఈ రెండు ప్రాంతాలకు రాకపోకలకు నాలుగు అండర్ బ్రిడ్జిలు, రైల్వే గేట్లే ఆధారం. అయ్యప్పగుడి రైల్వే ఓవర్ వంతెన నగరానికి ఓ కొసన ఉండడంతో ఎవరికీ ఉపయోగపడదు. వర్షాకాలంలో నాలుగు అండర్ బ్రిడ్జిలలోనూ నీళ్లు చేరి వాహనాల రాకపోకలు బంద్ అవుతున్నాయి. కొండాయపాలెం, బి.వి.నగర్ ఫ్లైఓవర్‌లు పూర్తయితే వర్షాకాలంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి.

## మోడరన్ విద్యార్థులకు వీడ్కోలు



నెల్లూరు సరస్వతినగర్‌లోని మాడరన్ స్కూల్‌లో ఈ నెల 16వ తేదీన పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అపస్మ అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి, రాంకుమార్, నారాయణ తదితరులు పాల్గొని పదో తరగతి పరీక్షలు వ్రాయబోతున్న విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు వ్రాసి ఉత్తీర్ణులు కావాలని వారు సూచించారు.




## 'ప్రభా'తం

# మాట నిలబెట్టుకోవాలి

**విభజనతో రాష్ట్రానికి గత పాలకులు చేసిన అన్యాయాన్ని సరిదిద్ది, రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదా హామీని కేంద్రంలోని నాయకులు నిలబెట్టుకోవాల్సి వుంది. చట్టాన్ని సవరించైనా సరే, లేక మరే ప్రత్యామ్నాయ మైనా సరే ఆలోచించి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలే తప్ప..అందుకు భిన్నంగా వ్యవహరించడం న్యాయం కాదు. బాధల్లో వున్న నవ్యాంధ్రను ఆదుకునేందుకు ప్రత్యేకహోదా, దానితో పాటు రాష్ట్రాభివృద్ధికి తగు ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాల్సివుంది.**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే విషయం మళ్ళీ అయోమయమయంగా మారుతోంది. విభజనలో జరిగిన అన్యాయం చాలక, ఇప్పుడు మళ్ళీ ప్రత్యేక హోదా విషయంలో స్పష్టమైన నిర్ణయాలు లేకుండా అప్పుడొక మాట..ఇప్పుడొక మాట చెప్తూ నాయకులు ఇంకా సన్నాయినొక్కులు నొక్కుతుండడం ఎంతైనా బాధాకరమే. విభజనతో అప్పులపాలై, చివరికి రాజధాని కూడా లేక, పరిపాలన అంతా అస్తవ్యస్థమై అటు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు, ఇటు ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంగా మారుతున్న సమయంలో, ప్రభుత్వాలు మారాయి కదా ఇక అంతా సజావుగానే జరుగుతుందని, జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది మళ్ళీ రాష్ట్రాన్ని ప్రగతి పథం పట్టిస్తారనుకుంటున్న సమయంలో, నాయకుల మారుతున్న మాటలు ప్రజలకు నిరాశ కలిగించేవిధంగా వుంటున్నాయి. విభజన సమయంలో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ..నేటికీ ఇంకా ఒక కొలిక్కిరాకపోగా, ఎప్పటికప్పుడు ఇలా చర్చనీయాంశంగానే మారుతూండడం, కాలయాపన జరుగుతూనే వుండడం ఎంతైనా విచారకరం.

రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం తొలినుంచీ తీసుకుంటున్న చర్యలు ఎంతైనా సంతోషదాయకం. ఎన్నోవిధాల నష్టపోయిన నవ్యాంధ్రను ఏదోఒక విధంగా ఆదుకునేందుకు, అవసరమైన నిధులను కేంద్రం ఎలాంటి తటపటాయింపు లేకుండా కేటాయిస్తూండడాన్ని ఎవరూ విస్మరించలేరు. ఆ విషయంలో ప్రధాని, కేంద్రప్రభుత్వం చేస్తున్న కృషి అపారం. ఇది ఎవరూ కాదనలేని సత్యం. కేంద్రం నుంచి ఆ మాత్రం ఆసరా లేకపోతే, రాష్ట్రం ఇప్పటికి ఇంకెంత అవస్థలు పడివుండేదో!.

అయితే, గత పాలకులు చిత్తం వచ్చిన రీతిగా, అస్తవ్యస్తంగా చేసిన నాటి విభజన తాలూకు కష్టాల నుంచి నష్టాల నుంచి నవ్యాంధ్ర ఇంకా పూర్తిగా తేరుకోనేలేదు. ఎప్పటికప్పుడు రాష్ట్రం ప్రగతి బాటలోకి పయనిస్తోందని ఆర్భాటంగా చెప్పుకుంటున్నప్పటికీ, ఆశించిన అభివృద్ధి మాత్రం కానరావడం లేదన్నది అందరికీ తెలిసిందే. ఎలాగో ఉగ్గబట్టి ఆర్థికబాధలు భరిస్తూనే ప్రగతి పథంలో నవ్యాంధ్ర రథం పయనించడానికి నానా తంటాలు పడుతూనే వుంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జరగాల్సిన పనులన్నీ ఇంకా మొదలు కానే లేదు. పారిశ్రామిక ప్రగతి కోసం ప్రయత్నాలు చురుగ్గానే జరుగుతున్నాయి కానీ, అవింకా ఒక కొలిక్కి రానే లేదు. ముఖ్యమైన ప్రగతి పనులన్నీ ఇంకా ప్రారంభదశలోనే వున్నాయి. లోటు బడ్జెట్‌ను పూడ్చుకోవడం ఎంతో కష్టతరంగానే వుంది. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అందరూ ఆకాంక్షిస్తున్నప్పటికీ, పెద్ద పెద్ద ప్రాజెక్టులు, ప్రధానమైన నీటి వనరులు, వ్యవసాయం, విద్యుత్, వైద్యం, విద్య, పరిశ్రమలు, ఉపాధి తదితర ప్రాధాన్యతగల రంగాలు నిధుల కొరతతో అల్లాడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో, విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం మరింత పెద్దమనసు చేసుకోవడం తప్ప మరో మార్గాంతరం లేదు. ఒకవైపు అవసరమైన నిధులిచ్చి ఆదుకుంటూనే, మరోవైపు విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చినప్పుడే బాధల్లో వున్న రాష్ట్రానికి కొంతైనా ఉపశమనం కలుగుతుంది. అలా కాక, అప్పటి మాటలకూ ఇప్పటి మాటలకూ పొంతన లేకుండా వ్యవహరించడం న్యాయం కాదు. విభజన సమయంలో రాష్ట్రానికి కనీసం అయిదేళ్ళపాటు ప్రత్యేకహోదా ఇస్తామంటే, కాదు..కనీసం పదేళ్ళయినా ఇవ్వాలని పట్టుబట్టిన నాయకులే ఇప్పుడు, అసలు విభజన చట్టంలో ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదని చెప్తే..ఇక రాష్ట్రం పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలి. రాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చిన నేతలు..నెలలు, సంవత్సరాలు దొర్లిపోతున్నా ప్రత్యేక హోదా ప్రకటించక, ఆ విషయంలో నేటికీ ఒక స్పష్టమైన నిర్ణయానికి రాలేకపోవడం ఎంత బాధాకరం?.. అప్పుల ఊబిలో, ఆర్థిక బాధల్లో కూరుకు పోయిన రాష్ట్రాన్ని రెండుచేతులా ఆదుకోవాల్సిన సమయంలో.. విభజన చట్టంలో గత పాలకులు ఆ ప్రస్తావనే తీసుకురాలేదనే విమర్శల వల్ల రాష్ట్రానికి ప్రత్యేకించి ఒరిగేదేమీ లేదు. అప్పటి పాలకులు రాష్ట్రం విషయంలో అన్నివిధాలా అన్యాయం చేశారు కనుకనే, ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు పూర్తిస్థాయిలో తిరస్కరించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలో మిత్రపక్షమైన తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పడడంతో నవ్యాంధ్రకు ఇక కొత్తవెలుగులు వస్తాయని ప్రజలంతా ఎంతో ఆశతో నేటికీ నిరీక్షిస్తూ వున్నారు. ఇప్పుడు తప్పకుండా ప్రత్యేకహోదా వస్తుందని, రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు కూడా ఇస్తారని, దాంతో విభజనతో జరిగిన నష్టాన్ని కొంతైనా పూడ్చుకోవచ్చని ఆశిస్తున్న తరుణంలో హోదా విషయంలో ఇప్పుడు భిన్నమైన మాటలు వినవస్తుండడం బాధాకరం. ఈ తీరు మారాలి. గత పాలకులు చేసిన తప్పులను పూర్తిస్థాయిలో సరిదిద్ది, రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదాను ఇవ్వడం ద్వారానే రాష్ట్రానికి ప్రయోజనం సిద్ధిస్తుందనేది ప్రజల ఆకాంక్ష. తద్వారా రాష్ట్రం ఆర్థికబాధల నుంచి బయటపడడానికి మార్గం వేసినట్లవుతుంది కూడా. అందువల్ల చట్టాన్ని సవరించైనా సరే, అందరూ కలిసి ఆలోచించి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలే తప్ప..అందుకు భిన్నంగా వ్యవహరించడం సముచితం కాదు. మీరు చేయలేని పని మేం చేసి చూపించాం అన్నట్లుగా వ్యవహరించాలే తప్ప, మేం చేయాలనుకున్నాం కానీ ఏదో ఒక కారణం వల్ల చేయలేకపోతున్నాం.. అనే ధోరణి మంచిది కాదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. డీలా పడిన రాష్ట్రానికి కొత్త ఉత్సాహాన్నివ్వాలి. అందుకు ప్రత్యేకహోదా ఎంతైనా అవసరం.. సముచితం కూడా!

ఏదేమైనా, అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ విజ్ఞులు, రాజనీతిజ్ఞులు..అనుభవజ్ఞులైన మంచి నేతలు మనకు వుండడం మన అదృష్టం. ఇకనైనా, రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ఇలాంటి విషయాల పట్ల నేతలు మరింత లోతుగా ఆలోచిస్తారనీ.. బాధల్లో వున్న నవ్యాంధ్రను ఆదుకోవాలనే దృఢసంకల్పంతో ప్రత్యేకహోదాతో పాటు రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తారని నవ్యాంధ్ర ఆశగా ఎదురుచూస్తోంది. ఆ ఆశలు, ఆకాంక్షలు ఫలించాలని మనసారా ఆశిద్దాం!...

# ఓట్ల రివిజన్‌పై శిక్షణ



ట్యాబ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ యం.జానకి

ఆధునిక సాంకేతిక పద్ధతిలో నాణ్యమైన ఓటర్ల జాబితాను తయారుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓట్లు గురించి కార్పొరేషన్, నెల్లూరురూరల్ సంబంధించిన అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్యాబులు, ఇతర సాంకేతిక పద్ధతి ద్వారా ఓటరు రివిజన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి సూపర్‌వైజర్లకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారికి ట్యాబులు ద్వారా ఓట్లు రివిజన్ గురించి శిక్షణ ఇవ్వాలన్నారు. తరువాత బూత్ లెవల్ అధికారులకు, కంప్యూటర్ డేటా ఆపరేటర్లకు కూడా తగు శిక్షణ ఇవ్వాలన్నారు. ట్యాబులలో వాడే చిప్‌లను వేయడానికి ఏ కంపెని బాగుంటుందో విశ్లేషించి దానికనుగుణంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి యం.సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు, నెల్లూరు ఆర్‌డిఓ వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం సిబ్బంది, కంప్యూటర్ నిపుణులు పాల్గొన్నారు.

### ముస్లిం యూత్ ఆధ్వర్యంలో

# పేదలకు పండ్లు, బిస్కెట్లు



నెల్లూరు ముస్లిం యూత్ సేవా కమిటి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా కమిటి అధ్యక్షుడు షేక్ ఖలీద్ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండి సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రంగనాయకులపేట రైలు పట్టాల మధ్యలో వున్న మొహిద్దీన్ షావల్లి అల్లా దర్గాలో ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నా, అబూజర్, అలీమ్, ఎజాజ్, ఇసాక్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేయాలి

భారత ప్రభుత్వం బడ్జెట్‌లో బంగారం మీద ఒక్క శాతం ఎక్సైజ్ డ్యూటీని విధించినందుకు నిరసనగా నెల్లూరు నగరంలోని చిన్నబజార్‌లోని బంగారు నగల హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు నిర్వహిస్తున్న బంద్‌కు వైసిపి కార్పొరేటర్లు వేలూరు సుధారాణి, లక్ష్మి సునంద, కృష్ణవేణి, గోగుల నాగరాజు, ఎండి ఖలీల్ అహ్మద్, ఓబిలి రవిచంద్ర తదితరులు మంగళవారం తమ మద్దతును తెలియజేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




## పిరికివాళ్ళ ఆదర్శమా!

ఒక ఆశయం కోసం పోరాడిన వాళ్ళు మనకు ఆదర్శమవుతారు. అంతేగాని ఒక పైత్యపు భావాన్ని తలకెక్కించుకుని, కొందరిపై విషభావ జాలాన్ని వెదజల్లుతున్న రోహిత్ వేముల, కన్నయ్య కుమార్ లాంటి వాళ్ళు ఈ దేశ ప్రజలకు ఆదర్శం కాదు. దేశం కోసం, ప్రజల కోసం పోరాడేవాళ్ళను అభిమానిద్దాం. ఈ దేశ సేవలో అమరులైన వారిని ఆరాధిద్దాం. ఈ దేశం మీద ద్వేషం వెళ్ళగక్కే కన్నయ్య లాంటి చీడపురుగులను ఛిదరించుకుందాం.

**- పి.లలిత, నెల్లూరు.**

## శాస్త్రిలు లేరు... ముఠామేస్త్రీలే!

దేశ రాజకీయాలలో ఎవరూ నీతిమంతులు లేరు. అందరూ దొంగలే! వాహిని వారి పెద్దమనుషులే! లాల్‌బహదూర్ శాస్త్రిలు లేరు... అవినీతి ముఠామేస్త్రీలే వున్నారు. ఏకపత్నీవ్రతులు లేరు... వేశ్యగుడిసెల్లో దూరేవాళ్ళే. భారతదేశంలో ఏ కొందరో తప్పితే మిగతా నాయకులందరూ స్వార్థపరులే! అవినీతి, అక్రమాలలో రాటుదేలినవాళ్ళే! జగన్ పత్రికలో వచ్చిన రాజధాని భూముల అక్రమాలు విడ్డూరమూ కాదు, వింతా కాదు, చంద్రబాబు, నారాయణలు నీతిమంతులు కాదు. జగనూ నీతిపరుడు కాదు. అందరూ అధికారాన్ని అడ్డంపెట్టుకుని సంపాదించుకున్నోళ్ళే!

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## ఏసిబి, ఈసీలు ఎందుకు?

ప్రతిపక్ష నాయకుడు జగన్ "చంద్రబాబు ఓటు-నోటు కేసు నుండి బయటపడేందుకు కేసీఆర్‌తో రాజీపడ్డాడు" అని అంటున్నాడు. ఓటు-నోటు నేరస్థులు రాజీలు కుదుర్చుకుంటే ఏసిబి, ఈసీలు ఉండేది ఎందుకు? దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్లు వీళ్ళు రాజీపడ్తూ వుంటే తమాషా చూస్తూ ఉండాలా? ప్రజలకు అనుమానాలు రాకుండా ఉండాలంటే ఓటు-నోటు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారినందరిని ఏ టు జడ్ విచారించాలి. కొందరిని విచారించకుండా ఉండబట్టే ఈ అనుమానాలు వస్తున్నాయి. కొందరిని ఎందుకు మినహాయించారు?

**- కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

నెల్లూరు కొత్త ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విశాల్ గున్నీ గారికి అభినందనలు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యపై ఆయన దృష్టి పెట్టాలి. నగరంలో ఎక్కువమందికి సమస్యగా మారింది ట్రాఫిక్కే. కొన్ని వేలుగా వున్న ఆటోల మూలంగా ట్రాఫిక్ సమస్యలు అంతకంతకు పెరుగుతున్నాయి. వీటిని సరిదిద్దాలని కోరుతున్నాము.

**జి.వి.సురేష్, నెల్లూరు.**



ఈమధ్య రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లకు, మున్సిపాల్టీలకు పనితీరును బట్టి ర్యాంకులిచ్చారు. నెల్లూరుజిల్లాకు చెందిన నారాయణ మున్సిపల్ శాఖకు మంత్రిగా నేతృత్వం వహిస్తున్నారు. అంటే నెల్లూరు నగరపాలక సంస్థకు ఆయనే పెద్దమనిషి. అలాంటి నెల్లూరు కార్పొరేషన్ ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో నిలిచింది. అయితే పైనుండి క్రిందకు కాదు... క్రింద నుండి పైకిపోయే వరుసలో రెండోస్థానమన్నమాట! రాష్ట్రంలో మనకంటే దరిద్రపు కార్పొరేషన్ ఇంకా ఒకటి ఉన్నందుకు మనం సంతోషించాలి. మున్సిపల్ మంత్రిగారి సొంత కార్పొరేషన్‌కు పట్టిన దౌర్భాగ్యమిది.

# నెల్లూరింతే... మారదంతే...!





నెల్లూరు కార్పొరేషన్ ఈ స్థాయిలో ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు. గత రెండేళ్లలో నెల్లూరు నగరపాలక సంస్థ పరంగా అభివృద్ధి చర్యలేవీ లేవు. కనీసం టైంకు కౌన్సిల్ సమావేశాలు కూడా జరగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు లేవు. 13వ ఆర్ధిక సంఘం నిధులతో పనులకు టెండర్లు పిలిస్తే కమిషన్ల కోసం వాటిని ముందుకు సాగనీయడం లేదు. వెయ్యి కోట్ల జైకా నిధులొస్తాయన్నారు. భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పనులన్నారు. పురోగతి లేదు. కార్పొరేషన్ ఆదాయం సిబ్బంది జీతాలకు సరిపోతోంది. అదనపు నిధులు వస్తేనేకాని అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితి. కొత్త రోడ్లు, కొత్త డ్రైనేజీ, కొత్త ప్రాంతాలకు విద్యుత్‌దీపాలు, మంచినీటి పైప్‌లైన్లు వంటి పనులే జరగడం లేదు. ముఖ్యమైన పారిశుద్ధ్య కార్యక్రమం పరమ అధ్వాన్నంగా వుంది. పందులు, కుక్కలు, కోతులతో ఈ నగరం నిండిపోయింది. మున్సిపల్ మంత్రి నారాయణ వుంటే నెల్లూరుకు ఏదన్నా చేద్దాం, ఈ కార్పొరేషన్ దరిద్రాన్ని వదిలిద్దామనే ఆలోచనే చేయడం లేదు. చేతిలో అధికారం, చేయగల అవకాశం ఉన్నోళ్లు కూడా పని చేయకపోతే ఇక ఈ నెల్లూరు ఎప్పుడు బాగుపడుంది!

# దీపమ్మకు స్త్రీశక్తి అవార్డు

## అభినందించిన ఆత్మీయులు



స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా సేవలందిస్తున్న శ్రీమతి దీపా వెంకట్‌కు స్త్రీశక్తి అవార్డు వచ్చినందుకు బిజెపి నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సామాన్య ప్రజలకు విద్య, వైద్యంతో పాటు గ్రామీణ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు వృత్తివిద్యా కోర్సులను ఏర్పాటు చేయడం, అదేవిధంగా మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ ప్రతి ఏడాది ఎంతో వేడుకగా పండుగలు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో ఆమె ప్రజల సంక్షేమం కోసం ఎన్నోరకాల సేవలందిస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, సీనియర్ నాయకుడు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్త్రీశక్తి అవార్డు వచ్చిన సందర్భంగా శ్రీమతి దీపావెంకట్‌ను వారు ఢిల్లీలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అభ్యున్నతికి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు, నిరుపేద విద్యార్థులకు విద్యనందించేందుకు ఆమె నిరంతరం చేస్తున్న సేవలను గుర్తించి ఆమె కృషికి గుర్తింపుగా ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డు లభించిందని వారు సంతోషం వ్యక్తం చేశారు.

## ఉన్నదే నలుగురు...



# పద్నాలుగు దారులు

కాంగ్రెస్‌పార్టీకి ఒక గొప్ప సాంప్రదాయముంది. ఆ పార్టీ అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా, ఇదేదీ కాకుండా చిక్కిశల్యమై శిథిలావస్థలో వున్నా పార్టీలోని నాయకుల మధ్య వర్గ విభేదాలు ఒకే స్థాయిలో ఉంటుంటాయి. ఇలాంటి పరిస్థితి ఇంకే పార్టీలోనూ ఉండదు. అది కాంగ్రెస్ గొప్పతనం. వారసత్వ వైభవం కూడా!

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ కోమా స్థితిలోకి వెళ్లిపోయింది. ఐసియులో వెంటిలేటర్ మీద వున్న రోగిలా వుంది ఆ పార్టీ పరిస్థితి. నెల్లూరుజిల్లాలో కూడా ఆ పార్టీ పొజిషన్ ఇలాగే వుంది. ముఖ్యమైన నాయకులందరూ వెళ్లిపోగా, ఎక్కడకూ పోలేని కొద్దిమంది నాయకులు మాత్రం ఐసియు పేషంట్ కాంగ్రెస్ కోలుకోకపోతుందా, మాకు మంచిరోజులు రాకుండా పోతాయా అన్న ఆశతో ఉన్నారు. కాంగ్రెస్ నుండి ఆనం, మేకపాటి, మాగుంట, నేదురుమల్లి వంటి కుటుంబాల నాయకులంతా వెళ్లిపోయారు. వాళ్లున్నప్పుడు కాంగ్రెస్‌లో పెద్దఎత్తున కొట్లాటలుండేవి. వారు వెళ్లినా ఆ పద్ధతిలో మార్పు లేదు.

## జిల్లా కాంగ్రెస్ తీరిది

ఇప్పుడు కూడా యధావిధంగా ఉన్నాయి. ఇటీవలే పార్టీ పదవుల పందేరం జరిగింది. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడుగా మల్లి బాలకృష్ణను డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య నియమించాడు. అయితే రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా వున్న కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఈ విషయంలో అసంతృప్తిగా ఉన్నాడు. ఈమధ్య కాలంలో జిల్లాలో కాంగ్రెస్ కార్యక్రమాలను నెత్తినేసుకుని మోసింది వినోద్‌రెడ్డే! కనీసం తనను సంప్రదించకుండా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిని నియమించడంపై వినోద్‌రెడ్డి అసంతృప్తి చెందుతున్నాడు. అలాగే మైనార్టీ నగర అధ్యక్ష పదవిని కూడా తెలుగుదేశం నుండి వచ్చిన వారికిచ్చారు. దీనిపై నగర కాంగ్రెస్ అధ్యక్షుడుగా వున్న ఉడతా వెంకట్రావ్‌యాదవ్ మనస్థాపం చెందివున్నాడు. ఈయన పీసీసీకి ఒక పేరును సూచించగా పనబాక కృష్ణయ్య మరొకపేరును ఖరారు చేశాడు.

పార్టీలో వుండేదే నలుగురు. వాళ్లంతా కలిసి వుంటేనే పార్టీ కనపడేది అంతంత మాత్రం. ఇక వీళ్లలో వీళ్లు తన్నుకోవడం మొదలుపెడితే కోమాలో వున్న కాంగ్రెస్‌కు వెంటిలేటర్ తీసేయడం ఖాయం.



# ఉత్సాహం చూపుతున్న విశాల్

- జిల్లా పోలీసు శాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన కొత్త ఎస్పీ
- రాగానే రౌడీలకు కౌన్సిలింగ్... ముందు మనం మారాలంటూ పోలీసులకు క్లాసు

*ఉద్యోగాన్ని బ్రతుకుతెరువు మార్గంగా చూడ్డానికి, అదే ఉద్యోగాన్ని సమాజం పట్ల తన బాధ్యతగా చూడ్డానికి చాలా తేడా వుంటుంది. ఉద్యోగం చేసేది తన జీతం కోసమే అని భావించే వాళ్లతో తెగేది, తెల్లారేదీ ఏమీ వుండదు. ఇటువంటి వాళ్ల వ్యవహారశైలి అంతా కూడా తిన్నామా, పడుకున్నామా, తెల్లారిందా అన్నట్లుంటుంది. విధి నిర్వహణను ఒక సామాజిక బాధ్యతగా చూసి పనిచేసే వాళ్లతోనే ఈ సమాజానికి అంతో ఇంతో మేలు జరుగుతుంది.*

మన దేశంలో ప్రజాప్రతినిధులు సైతం చేయలేని పనులను చేయగల శక్తి కొన్ని అధికారిక పదవులకే లభిస్తుంది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ... అధికారిక విధి నిర్వహణలో ఈ రెండు పోస్టులు చాలా కీలకం. సంబంధిత అధికారుల్లో ప్రజలకు మేలు చేయాలనే మంచి ఆలోచనలు, చేయగల అంకితభావం ఉంటే వారివల్ల ఆ జిల్లానే బాగుపడుతుంది. ఒక కలెక్టర్ సామర్థ్యం మీద ఒక జిల్లా అభివృద్ధి ఆధారపడుతుంది. ఒక ఎస్పీ శక్తిసామర్థ్యాల వల్ల ఒక జిల్లా ప్రశాంతంగా ఉంటుంది.

నెల్లూరుజిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ విశాల్‌గున్నీలో పని చేయాలనే ఉత్సాహం కనిపిస్తోంది. డైరక్ట్ ఐపిఎస్ అధికారి. ఎస్పీగా నెల్లూరులోనే తొలి పోస్టింగ్. లక్షలకు లక్షలు జీతమొచ్చే సాఫ్ట్‌వేర్ రంగాన్ని వదిలేసి ఐపిఎస్‌గా ప్రజలకు తనవంతు సేవలందించాలని పట్టుబట్టి సివిల్స్ వ్రాసి అనుకున్నది సాధించాడు. ఒక అధికారి తన సమర్ధతను నిరూపించుకునే అవకాశం. నెల్లూరుజిల్లాలో ఎస్పీలంటే గుర్తున్న పేర్లు జస్పాల్ సింగ్, కె.శ్రీనివాసరెడ్డిలే! ఎంతోమంది ఎస్పీలుగా పనిచేసినా ఈ జిల్లా ప్రజలు మరచిపోలేని విధంగా పనిచేసింది వాళ్లిద్దరే! పోలీస్‌శాఖపై వాళ్లు అంతటి ప్రభావం చూపగలిగారు.

ఇప్పుడు విశాల్ గున్నీలో కూడా పని చేసే తపన, పోలీసుల చేత పని చేయించాలనే ఉత్సాహం కనిపిస్తోంది. రావడంతోనే అదరాబదరా ఏదో ఒకటి చేసేయకుండా, జిల్లా పరిస్థితులను అధ్యయనం చేస్తున్నాడు. జిల్లా గురించి జిల్లాలో శాంతి భద్రతల తీరుతెన్నుల గురించి సమాచారం సేకరిస్తున్నారు. రాగానే రౌడీమేళా నిర్వహించి, పాత రౌడీ మహాశయులందరికీ వార్నింగ్ ఇచ్చాడు. అయితే మునుపటితో పోలిస్తే నెల్లూరులో రౌడీయిజం చాలావరకు తగ్గినట్లే! గతంలో సెంటర్‌కొక ఆకు రౌడీ ఉండేవాడు. శ్రీనివాసరెడ్డి ఎస్పీగా వచ్చాక ఈ ఆకురౌడీలంతా చాకులను పారేసి కొత్త జీవితాలను ఆరంభించారు. విశాల్‌గున్నీ ఇంతే కఠినంగా ఉంటే చాలు... రౌడీలు, కేడీలు ఎవరి హద్దుల్లో వాళ్లుంటారు. నెల్లూరు నగరంలో వాహనాన్ని నడపడంకంటే కూడా జెమిని సర్కస్‌లో సైకిల్ తొక్కడం చాలా సులభంగా ఉంటుంది. నగరంలో అంతటి దరిద్రంగా వుంది ట్రాఫిక్. నగరంలో పర్యటించిన ఎస్పీ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రధానంగా నగరంలోని పలు సెంటర్లలో రోడ్లకు అడ్డంగా వున్న ట్రాఫిక్ ఐలాండ్‌లను తగ్గించే ప్రయత్నంలో ఎస్పీ ఉన్నట్లు తెలుస్తోంది.

అన్నింటికంటే ముఖ్యంగా ఆయన సొంత శాఖను దారిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా పోలీసుశాఖ దారి తప్పిందనేది వాస్తవం. దీనికంతటికీ కారణం అదిరించి కదిలించే అధికారి లేకపోవడమే. రౌతు మెత్తనైతే గుర్రం మూడుకాళ్ల మీద నడుస్తుందన్న సామెత పోలీసు శాఖలో ఇప్పటివరకు అమలవుతూ వచ్చింది. యధారాజా తథాప్రజా అన్నట్లు వచ్చిన ఉన్నతాధికారులు తమ పరిధి ఇంతేనని గిరిగీసుకుని పనిచేస్తుండడం వల్ల క్రింది స్థాయి సిబ్బంది అంతకంటే చిన్న గిరి గీసుకుని పని చేస్తున్నారు. జిల్లాలో పోలీసుల పనితీరును ఎలా మార్చారంటే, ఫలానా చోట మర్డర్, లేదా దొంగతనం జరుగుతుందని ముందే తెలిసినా, దానిని అడ్డుకోవడానికి బదులు అక్కడ నేరం జరిగాక కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం మా పని అనే కోణంలోకి వచ్చేశారు.

పోలీసు శాఖలో మితిమీరిన రాజకీయ జోక్యం, అసమర్ధులకు ప్రాధాన్యతగల పోస్టులు వంటివి కూడా ఈ నిస్తేజానికి కారణం కావచ్చు. పోలీసుశాఖలో నెలకొన్న ఇలాంటి జాడ్యాన్ని పోగొట్టాల్సిన బాధ్యత విశాల్‌పై వుంది. నేరాలు జరిగాక కేసులు, దర్యాప్తు కాదు, నేరాలు జరగకుండా జిల్లాలో అరాచకశక్తులకు పోలీసు భయం పెట్టి అమాయకులకు అభయమిచ్చి, ప్రజలకు పోలీసులంటే భక్తి పెరిగేలా పోలీసుశాఖను సంస్కరించడానికి విశాల్ ప్రయత్నించాలి.

# నెల్లూరు కబుర్లు



## నెల్లూరుకు... నిఘా కళ్ళు

నేర నియంత్రణకు, నేరస్థుల పట్టివేతకు ఎంతో బాగా ఉపయోగపడే సి.సి.కెమెరాలను ఇప్పుడు నెల్లూరు నగరంలోని ముఖ్యకూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో సి.సి.కెమెరాల ఏర్పాటుకు నగరపాలక సంస్థ 50లక్షల రూపాయలు మంజూరు చేసింది. కొత్తగా వచ్చిన ఎస్పీ విశాల్ గున్నీ ఈ నిధులను ఉపయోగించి సి.సి కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నారు. ముందుగా అత్యంత రద్దీ ప్రాంతమైన ఏ.సి కూరగాయల మార్కెట్ ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేశారు. అలాగే వివిఆర్సీ, కెవిఆర్ పెట్రోల్‌బంకు, గాంధీబొమ్మ సెంటర్లలో కూడా ఏర్పాటు చేశారు. 15వ తేదీ రాత్రి ఎస్పీ విశాల్ ఏసి మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరా పనితీరును పరిశీలించారు. నగరంలో పెడుతున్న సి.సి. కెమెరాలన్నింటికి కమాండ్ కంట్రోల్ సిస్టంను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమైన ఈ కూడళ్లలో నేరాల నియంత్రానికే కాక ట్రాఫిక్‌ను అదుపులో పెట్టడానికి కూడా ఈ సి.సి.కెమెరాలు ఉపయోగపడగలవు.

## 'రాఫా' ఐ కేర్ వారి వైద్యశిబిరం



ఇమ్మానియేల్ గ్రూప్ ఆఫ్ మినిస్ట్రీస్ వారి సహకారంతో 'రాఫా ఐ కేర్' ఆసుపత్రి వారు ఈ నెల 13వ తేదీన నెల్లూరు, వెంకటేశ్వరపురంలోని డాన్ బాస్కో స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఏఆర్‌కె హిమబిందు, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం.రాజేశ్వరి, చక్కెర వ్యాధి నిపుణులు డాక్టర్ సుధాకర్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నిశ్చల్‌లు ఈ వైద్య శిబిరంలో పాల్గొని 200మంది దాకా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని రోగులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌ఎన్‌ఎల్ సీనియర్ సూపర్‌వైజర్ అరవ పార్వతయ్య, డాన్‌బాస్కో స్కూల్ కరస్పాండెంట్ డి.జాషువా తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌సి వాకర్స్ స్వచ్ఛభారత్



విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విఆర్ కళాశాల మైదానంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పందిళ్ళపల్లి పట్టాభి రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమాజాభివృద్ధికి తోడ్పడే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు ప్రతి ఒక్కరు మరుగుదొడ్డి నిర్మించుకోవాలని అందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌సి వాకర్స్ మహిళా విభాగం సభ్యులు, కార్యదర్శి రమణమూర్తి, గౌరవ అధ్యక్షుడు డా॥ సి.భాస్కర్‌రావు, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, డా॥ పి.పెంచలయ్య, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు అనురాధ, డా॥ సులోచన తదితరులు పాల్గొన్నారు.

## 'జీవరహస్య లిపి' పుస్తకావిష్కరణ



నెల్లూరుజిల్లా సోమశిలకు చెందిన కవి ఖాదర్ షరీఫ్ రచించిన కవితా సంపుటి 'జీవరహస్య లిపి' పుస్తకాన్ని ఆదివారం విక్రమ సింహపురి యూనివర్శిటి తెలుగు విభాగాధిపతి శ్రీపాద జయప్రకాష్ ఆవిష్కరించారు.

సాధనా పదయాత్రను పురస్కరించుకుని నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ 21వ సాధన పదయాత్ర సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సాధన పదయాత్ర షిరిడి సాయిబాబా మందిరం నుండి గొలగమూడిలోని వెంకయ్యస్వామి మందిరం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో అల్లు భాస్కరరెడ్డి, అల్లు రమణమ్మ, పెరుగు రామకృష్ణ, వంశీకృష్ణ, ఖాదర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్‌లకు కొత్తహంగులు




జిల్లా పోలీసుశాఖలో మార్పును తీసుకొచ్చే దిశగా కృషి చేస్తున్న ఎస్పీ విశాల్‌గున్నీ పనిలో పనిగా జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌లను కూడా మార్చాలని ఆదేశించినట్లు సమాచారం. మన పోలీసు స్టేషన్లు ఏ విధంగా ఉంటాయో అందరికీ తెలిసిందే! రంగులు వెలసిపోయి, బూజు, ధుమ్ము పట్టి అపరిశుభ్రంగా ఉంటుంటాయి. ఇటీవలకాలంలో ఆఫీసర్లు ఆసక్తికొద్ది కొన్ని స్టేషన్‌లను మాత్రం అందంగా తీర్చిదిద్దుకున్నారు. ముందు పోలీసుస్టేషన్‌లకు పట్టిన మురికిని వదిలించాలని ఎస్పీ నిర్ణయించారు. ఈమేరకు వారం రోజుల లోపల అన్ని పోలీసుస్టేషన్‌లకు రంగులు వేయించాలని, ఆవరణలో పూలమొక్కలు పెంచాలని, ప్రతి పోలీసుస్టేషన్‌లోనూ ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలని ఎస్పీ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ పనుల కోసం అవసరమైతే దాతల సహకారం కూడా తీసుకోండని ఆయన సూచించినట్లు సమాచారం. ప్రస్తుతం అన్ని పోలీసుస్టేషన్‌ల ఫోటోలు తీసి తనకు పంపించాలని, వారం తర్వాత అందంగా ముస్తాబుచేసిన పోలీసుస్టేషన్‌ల ఫోటోలు తీసి కూడా తనకు పంపించాలని ఆయన ఆదేశించినట్లు తెలుస్తోంది.

## శ్రీ రంగనాథుని బ్రహ్మోత్సవాలు



ఆంధ్రా శ్రీరంగంగా ప్రసిద్ధిగాంచిన నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుండి మొదలవుతున్నాయి. 18వ తేదీ అంకురార్పణ జరుగుతుంది. 19వతేదీ పొద్దున ధ్వజారోహణ, రాత్రి శేషవాహనం, 20వ తేదీ పొద్దున సూర్యప్రభ, రాత్రి హంసవాహనం, 21వ తేదీ పొద్దున సింహవాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 22వ తేదీ పొద్దున పల్లకీ సేవ, రాత్రికి హనుమంతుసేవ, 23వ తేదీ పొద్దున మోహిని అవతారం, రాత్రికి బంగారు గరుడసేవ, 24వ తేదీ రాత్రి కల్యాణోత్సవం, 25వ తేదీ పొద్దున రథోత్సవం, రాత్రికి పొన్నవాహనం ఉంటాయి. 26వ తేదీ అశ్వవాహనం, 27వ తేదీ ప్రణయకలహోత్సవం, చక్రస్నానం, 28వ తేదీ సాయంత్రం పుష్పయాగం, రాత్రి ధవనోత్సవం, ధ్వజారోహణం జరుగుతాయి. 29వ తేదీ రాత్రి తెప్పోత్సవంతో తిరునాళ్లు ముగియనున్నాయి. తిరునాళ్లలో 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 5.30గంటల నుండి 6.30గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి ఊంజల్‌సేవ, ఏకాంత సేవలు నిర్వహించనున్నారు. ఆలయ ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో తిరునాళ్ల ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## డిఇఓకు అదనపు పని

నెల్లూరులోని ప్రభుత్వ బిఇడి కాలేజీ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా జిల్లా విద్యాశాఖాధికారిగా వున్న ఆంజనేయులుకే బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు రీజనల్ జాయింట్ డైరెక్టర్ పార్వతి ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఆంజనేయులు గతంలో ఈ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉండే డిఇఓగా రావడం జరిగింది.

## క్యాన్సర్ ఆసుపత్రిలో రేడియోథెరపీ పునఃప్రారంభం

నెల్లూరు, పొదలకూరురోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు రేడియోథెరపీ చికిత్సను పునఃప్రారంభించినట్లు ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కోబాల్ట్ యూనిట్‌లో చేయాల్సిన సాంకేతిక మార్పుల మూలంగా ఈ యేడాది ఫిబ్రవరి 1 నుండి రేడియోథెరపీ చికిత్సను నిలిపేసారు. ఎట్టకేలకు విజయవంతంగా ఆ సాంకేతిక మార్పును పూర్తి చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ యం.జానకి ప్రత్యేక చొరవ తీసుకుని రేడియోథెరపీ చికిత్సను తిరిగి ప్రారంభించేలా చేశారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని డాక్టర్ టి.లక్ష్మి తెలిపారు.

## వియస్‌యూ రిజిస్ట్రార్‌గా శివశంకర్

విక్రమ సింహపురి యూనివర్శిటి మొట్టమొదటి పాలక మండలి సమావేశం సోమవారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఉన్నత విద్యా ప్రిన్సిపల్ సెక్రటరి సుమితా ధావ్రా, కళాశాలల ఛైర్మన్ ఉదయలక్ష్మిల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా వర్సిటీ కళాశాలను, పరిపాలనా భవనాన్ని కాకుటూరులో నిర్మించిన నూతన నిర్మాణంలోకి మార్చేందుకు ఈసీ నిర్ణయం తీసుకుంది. వచ్చే రెండు మూడు నెలల్లో పూర్తిగా నూతన నిర్మాణాల్లోకి మార్చేలా చర్యలు తీసుకొంటామని వీసి వీరయ్య ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ శివశంకర్‌లు కమిటికి తెలిపారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పిఆర్ శివశంకర్‌ను రెగ్యులర్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

## నెల్లూరు కలెక్టర్ ఆఫీసులో మోహన్‌కందా ఐఏఎస్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ప్రధానకార్యదర్శి మోహన్ కందా ఈ నెల 11న నెల్లూరుకు సొంత పనిమీదొచ్చారు. జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ యం.జానకితో కొద్దిసేపు మాట్లాడారు. మోహన్‌కందా ఐఏఎస్ పేరు రాష్ట్రంలో చాలామందికి గుర్తుంటుంది. మెగాస్టార్ చిరంజీవి నటించిన సూపర్‌హిట్ మూవీ 'ఠాగూర్'లో చిరంజీవి, హీరోయిన్ శ్రియల మధ్య ప్రశ్నలు-జవాబుల పరంపరలో మోహన్‌కందా పేరు వస్తుంది. ఆ సినిమా వల్ల కూడా మోహన్‌కందా ఐఏఎస్ పేరు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు సినిమా ప్రియులలో కూడా బాగా పాపులరైంది.

## ల్యాప్రోస్కోపిక్ ద్వారా గర్భాశయ ఆపరేషన్లు

గతంలో క్యాన్సర్ సోకితే ఆపరేషన్లు చేయాలంటే భయపడేవారని, ఇప్పుడు ఎలాంటి నొప్పి లేకుండానే ల్యాప్రోస్కోపిక్ విధానంతో గర్భాశయ ఆపరేషన్లు చేయవచ్చని ప్రముఖ క్యాన్సర్ ల్యాప్రోస్కోపిక్ డాక్టర్ రమేష్ మాటూరి అన్నారు. ఆదివారం నెల్లూరు హరనాథపురంలోని అపోలో సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రిలో గర్భాశయ వ్యాధులు - క్యాన్సర్‌కు ల్యాప్రోస్కోపి ఆపరేషన్లు అనే అంశంపై అపోలో హాస్పిటల్స్, నెల్లూరు గైనకాలజీ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ వీనస్ థ్రాంబో ఎంబాలిజం అనే రిస్క్‌ను గర్భిణులలో ఎలా తగ్గించవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ రూప,




అపోలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి, ఆసుపత్రి యూనిట్‌హెడ్ నవీన్, డాక్టర్ జయప్రద పాల్గొన్నారు.

# గజరావు భూపాల్‌కు వీడ్కోలు



నెల్లూరుజిల్లా ఎస్పీగా పనిచేస్తూ సిఐడికి బదిలీపై వెళ్లిన డాక్టర్ గజరావు భూపాల్‌కు పోలీసు అధికారుల సంఘ నాయకులు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ గజరావు భూపాల్, ఆయన సతీమణిని శాలువ, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సేవలను కొనియాడారు. ఏపి పోలీస్ అధికారులసంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యం.గంగాధర్, జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, కార్యదర్శి జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, వహీద్, శివకుమార్, ప్రసాద్, ముజఫర్ రెహ్మాన్, పరమేశ్వరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పదికి పటిష్ట ఏర్పాట్లు



ప్రతి విద్యార్థి జీవితంలోనూ తొలి గెలుపు, తొలి మలుపు పదోతరగతి పరీక్షలు. 2015-16 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ పరీక్షలు ఈ నెల 21వ తేదీన మొదలై ఏప్రిల్ 7వ తేదీతో ముగియనున్నాయి. జిల్లాలో 184 పరీక్షా కేంద్రాలలో 34,559మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల దాకా పరీక్ష వుంటుంది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఈ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ఎం.జానకి సంబంధిత అధికారులతో ఈ నెల 14న ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఏర్పాట్లపై చర్చించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తగిన వసతులు కల్పించాలని ఆమె అధికారులకు సూచించడం జరిగింది.

# నెల్లూరులో విజిలెన్స్ డిజి



ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వరకు మహిళా ఐపిఎస్‌లలో గుర్తుకొచ్చే పేరు అనూరాధ. సమర్ధవంతురాలైన పోలీస్ ఆఫీసర్. ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ జనరల్‌గా వున్న ఏఆర్ అనూరాధ ఈ నెల 11న నెల్లూరొచ్చారు. జిల్లా కలెక్టర్ యం.జానకితో కలిసి ఆమె నెల్లూరులోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యాలయం ప్రాంగణంలో కొత్తగా కట్టిన ఎస్పీ ఛాంబర్‌ను ఆమె ప్రారంభించారు. జిల్లాలో అక్రమ రవాణా, అక్రమ నిల్వలు వంటి వాటిపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె విజిలెన్స్ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్పీ రమేషయ్య, డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, సిఐలు కె.శ్రీనివాసరావు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్లకోమా వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

**- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డా॥ పి.శ్రీనివాసన్**





కంటికి సంభవించే గ్లకోమా వ్యాధిపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని నెల్లూరుజిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డా॥ పి.శ్రీనివాసన్ పేర్కొన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని 12వ తేదీ నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వాసుపత్రి కంటి విభాగంలో ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లకోమాపై అవగాహన పెంచుకోవడం ద్వారా సకాలంలో వైద్యసేవలను పొంది చూపును కోల్పోకుండా కాపాడుకోవచ్చున్నారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి మంజులమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంవత్సరానికొకసారి గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలన్నారు. డా॥ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో గ్లకోమా కంటి పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా॥ కళారాణి, డా॥ యం.శర్వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఎస్పీగా శరత్‌బాబు



నెల్లూరుజిల్లా ఎస్పీ, ఏఎస్పీల బదిలీలు ఒకేసారి జరిగిపోయాయి. జిల్లా ఏఎస్పీగా వున్న రెడ్డి గంగాధర్‌ను రాజమండ్రి అర్బన్ ఏఎస్పీగా బదిలీ చేశారు. ఏలూరుకు చెందిన రెడ్డి గంగాధర్ 2014 జనవరి 3వ తేదీన నెల్లూరు ఏఎస్పీగా వచ్చారు. పనితీరులో ఉరుములు, మెరుపులు లేకపోయినా, వివాదాలు మాత్రం తెచ్చుకోలేదు. లౌక్యంగా పనిచేసుకుంటూపోయారు. ఇక కొత్త ఏఎస్పీ బి.శరత్‌బాబుది గుంటూరే! నెల్లూరుకు పాతోడే! 1985బ్యాచ్ ఎస్ఐ ఆయన. నెల్లూరులోని బాలాజీనగర్, కావలిలలో సిఐగా, నెల్లూరు ఏసిబి డిఎస్పీగా పని చేశారు. ఇప్పుడు రాజమండ్రి అర్బన్ ఏఎస్పీగా పనిచేస్తూ నెల్లూరుకు బదిలీ అయ్యారు.

# అసెంబ్లీలో మన ఎమ్మెల్యేల వాణి

ప్రస్తుత శాసనసభ సమావేశాలలో తమ నియోజకవర్గాలలోని సమస్యలపై జిల్లా శాసనసభ్యులు తమ గళం విప్పారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

## పెరిక బలిజలకు బి.సి సర్టిఫికేట్లివ్వండి - కోటంరెడ్డి



నెల్లూరుజిల్లాలో పెరిక బలిజ కులస్థులకు బి.సి సర్టిఫికేట్లు మంజూరు చేయాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సభలో డిమాండ్ చేశాడు. చిత్తూరు, కడప, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, తూర్పుగోదావరి జిల్లాల్లో పెరికబలిజ కులస్థులకు బి.సి-బి క్రింద సర్టిఫికేట్లు ఇస్తున్నారని, నెల్లూరుజిల్లాలో మాత్రమే ఇవ్వకపోవడం వల్ల ఆ కులస్థులు అన్ని విధాలుగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత మంత్రిని, రెవెన్యూ అధికారులను సంప్రదించానని, ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. అలాగే బేడ, బుడగ జంగం కులస్థులను ఎస్సీల జాబితాలో చేర్చాలని కోరారు. అలాగే నెల్లూరు రూరల్‌లో ముస్లిం సోదరుల కోసం షాదీమంజిల్, కార్పొరేషన్ పరిధిలో క్రైస్తవుల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఆయన కోరడం జరిగింది.

## ఎయిర్‌పోర్టు భూముల్లో అక్రమాలు - కాకాణి



దగదర్తి మండలం దామవరం వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు సేకరించిన భూముల విషయంలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే విషయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి లేవనెత్తాడు. కీరుగుంట, దామవరం గ్రామాల్లో ప్రభుత్వం భూసేకరణ జరిపిన సందర్భంగా అక్కడున్న దళితులు, పేదల భూములను వేరొకరి పేర్లతో మార్చారని, విశ్రాంత సైనికులకు కేటాయించిన భూములను వేరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎయిర్ పోర్ట్‌ను ముందు 2480ఎకరాలలో ఏర్పాటు చేయాలనుకున్నారని, ఇప్పుడు 1390ఎకరాలకు కుదించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బడాబాబుల కబంధహస్తాల్లో వున్న ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని న్యాయపరంగా రైతులందరికీ నష్టపరిహారం పంపిణీ చేయాలని ఆయన కోరారు.

## షాదీమంజిల్ మంజూరు చేయండి - అనిల్



నెల్లూరు నగరంలో ముస్లిం సోదరులు అత్యధిక సంఖ్యలో ఉన్నారని, వారి సౌకర్యార్థం నగరంలో కొత్త షాదీమంజిల్ మంజూరు చేయాలని నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ కోరారు. కోటమిట్టలో వున్న షాదీమంజిల్ శిథిలావస్థకు చేరుకుని, అక్కడ కార్యక్రమాలు నిర్వహించాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కాబట్టి దానికి కూడా మరమ్మత్తులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తేవాలని ఆయన కోరారు.

# జిల్లాలో కొత్త ఓటర్ల జాబితా

**మొత్తం 22,05,684 మంది ఓటర్లు**

జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 22,05,684 మంది ఓటర్లు వున్నట్లు ఈనెల 14న నెల్లూరు కలెక్టరేట్ అధికారులు ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఇటీవల స్వల్పంగా 2441 మంది ఓటర్లు పెరిగారని, నెల్లూరు అర్బన్-రూరల్ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియ జరుగుతోందని ఈ సందర్భంగా అధికారవర్గాలు పేర్కొన్నాయి. పెరిగిన ఓటర్లలో అధికశాతం మహిళలు, విద్యార్థులున్నారు. ఆయా నియోజకవర్గాల్లో తాజా వివరాల ప్రకారం, కావలి నియోజకవర్గంలో 2,29,160 మంది ఓటర్లుండగా, ఆత్మకూరులో 1,87,712, కోవూరులో 2,41,641, నెల్లూరు అర్బన్‌లో 2,32,822, నెల్లూరు రూరల్‌లో 2,61,471, సర్వేపల్లిలో 2,03,797, గూడూరులో 2,09,852, సూళ్ళూరుపేటలో 2,15,630, వెంకటగిరిలో 2,16,933, ఉదయగిరిలో 2,06,666 మంది ఓటర్లున్నట్లు పేర్కొన్నారు.



# ముత్యాలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు





సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ గిరీషా

చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ఈ నెల 29వ తేదీ నుంచి నాలుగురోజుల పాటు నిర్వహించే ముత్యాలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలని సబ్‌కలెక్టర్ గిరీషా సూచించారు. ఇటీవల తూర్పుకనుపూరులో వివిధశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యాలమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా విస్తృతంగా ఏర్పాట్లను చేయాలన్నారు. భక్తులకు జాతరలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని చెప్పారు. జాతర జరిగే నాలుగు రోజులు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండే విధంగా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. తూర్పు కనుపూరుకు వెళ్లే మార్గాల్లో దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులకు సూచించారు. జాతరలో మద్యం విక్రయాలు జరగకుండా చూడాలన్నారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం వచ్చే అవకాశాలున్న దృష్ట్యా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వాకాడు, తదితర ప్రాంతాల నుంచి 150బస్సులు భక్తుల సౌకర్యార్థం నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు ప్రసాద్, లీలారాణి, ఎంపిడివో విజయేంద్రకుమార్, గ్రామీణ, వాకాడు సిఐలు శ్రీనివాసులు రెడ్డి, అక్కేశ్వరరావు, డిస్కం డిఇ అనీల్‌కుమార్, ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి, ఎస్సై అంకమ్మ, సర్పంచి సింహాద్రి సత్య నారాయణశెట్టి, గూడూరు వాకాడు ఆర్టీసీ డిఎంలు అనిల్‌కుమార్, దివ్యకామాక్షి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# మున్సిపల్ వార్డుల తనిఖీ



వ్యర్థాల తొలగింపు చర్యలను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణంలోని పలు వార్డుల్లో 12వ తేదీ ఉదయం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలువల్లో మురుగు, వీధుల్లో పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. 6వ వార్డులోని మాతమ్మ గుడి వీధిలో మురుగు, వ్యర్థాలు సరిగా తొలగించకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. అనంతరం వివేకానంద రోడ్డులోని ఎన్టీఆర్ సుజల నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. పట్టణంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉందని, మంచినీటిని వృథా చేయరాదన్నారు.

# సత్వర న్యాయం - లోక్‌అదాలత్ ధ్యేయం




లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న ఏడో జిల్లా అదనపు జడ్జి గురప్ప, న్యాయమూర్తి సాయిరాం

గూడూరులోని కోర్టు ప్రాంగణంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 12వ తేదీ జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడో జిల్లా అదనపు జడ్జి గురప్ప మాట్లాడుతూ రాజీమార్గంతో లోక్‌అదాలత్ ద్వారా సత్వరన్యాయం అందుతుందన్నారు. క్షణికావేశంలో కోర్టులకెక్కి సమయాన్ని వృథా చేసుకోకుండా ఒకటికి నాలుగుసార్లు ఆలోచించుకోవాలన్నారు. లోక్‌అదాలత్‌లో ఇచ్చే తీర్పే అంతిమ మన్నారు. న్యాయమూర్తి కె.పి. సాయిరాం మాట్లాడుతూ ఇక్కడ రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం పొందినవారు గ్రామాల్లో మిగిలిన వారికి అవగాహన కలిగించి దీన్ని ఉపయోగించుకునేలా చూడాలన్నారు. లోక్‌అదాలత్‌లో 42క్రిమినల్, 6 సివిల్ కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. తద్వారా రూ.13,46,024లు బాధితులకు లబ్ది చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు కోటేశ్వరరావు, ఉమాశంకర్, గ్రామీణ ఎస్సై జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కరుడుగట్టిన నేరగాళ్ల సంచారం

## నియంత్రణకు ప్రత్యేక చర్యలు - డిఎస్పీ బి.శ్రీనివాస్



గూడూరు డిఎస్పీ కార్యాలయంలో డివిజన్ స్థాయి సిఐలు, ఎస్సైలతో నేరాల నియంత్రణపై సమీక్షా సమావేశాన్ని సోమవారం డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ నిర్వహించి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరుడుగట్టిన నేరగాళ్ల ముఠా సంచరిస్తున్నట్లు ప్రాథమికంగా సమాచారం ఉందని, దీంతో అప్రమత్తమై నేరాల నియంత్రణకు ప్రత్యేకచర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు, రాష్ట్రానికి చెందిన నాగరాజు అనే కరుడుగట్టిన(గ్యాంగ్ ముఠా) హంతకులు సంచరిస్తున్నట్లుగా తెలిసిందని, వీరు ఇళ్ల వద్దకు వచ్చితమ అక్క పెళ్లికి నగదు సహాయం చేయమని ప్రాధేయ పడుతున్నట్లు నటించి దారుణంగా హత్యలు చేసి చోరీలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. వీరిని పట్టుకునేందుకు పోలీసుశాఖ మాత్రమే కాకుండా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు డివిజన్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనాలు నిలపకుండా పర్యవేక్షిస్తూ గస్తీని పెంచాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐలు శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు, సుబ్బారావు, రత్తయ్య, డివిజన్లలోని ఎస్సైలు పాల్గొన్నారు.

# నడకతో మంచి ఆరోగ్యం

## - డాక్టర్ ఎం.వి రమణమూర్తి




నడకతో మంచి ఆరోగ్యం లభిస్తుందని, రోజూ నడక సాగిస్తే శరీరంలో రక్తప్రసరణ బాగా జరిగి ఆరోగ్యంగా వుండవచ్చని బొల్లినేని ఆసుపత్రికి చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎం.వి రమణమూర్తి అన్నారు. ఈ నెల 13న స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా, మెదడు, వెన్నెముక వ్యాధులను వివరిస్తూ, ఆ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఆ వ్యాధులను ఎలా గుర్తించాలి, వాటి నివారణకు ఎలాంటి చికిత్సలు తీసుకోవాలనే విషయాలను వివరించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, అదేవిధంగా ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా వుండాలని అన్నారు. మెదడులో రక్తప్రసరణ బాగా జరగకుంటే పక్షవాతం సంభవించే ప్రమాదం వుందన్నారు. బిపి, షుగర్‌లను అదుపులో వుంచుకోకుంటే మూర్ఛవ్యాధి వచ్చే అవకాశం వుందన్నారు. వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా వుండాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం వల్ల తక్కువ వ్యయంతోనే మెరుగైన వైద్యం చేయించుకునేందుకు వీలుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. రంగారావు, ఉపాధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, సహాయ కార్యదర్శి రవి, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ అంకిరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, వీరిశెట్టి హజరత్‌బాబు, వేణుగోపాల్, హరిప్రసాద్, అమరేంద్ర, డాక్టర్ దొరస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### యంత్రాలతో ఇసుక తవ్వితే

## లక్ష జరిమానా

ఇసుక రీచ్‌లలో యంత్రాలతో (జేసిబి-ప్రొక్లయిన్) ఇసుక తవ్వకాన్ని, ఇసుక ఎత్తడాన్ని పూర్తిగా నిషేధించారని, ఎవరైనా అలా చేస్తే వాల్టా చట్టాన్ని అనుసరించి లక్ష రూపాయల జరిమానాతో పాటు, ఆయా యంత్రాల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదవుతాయని జిల్లా స్థాయి ఇసుక కమిటీ మెంబర్ కన్వీనర్ టి. రాజశేఖర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# పాన్‌బ్రోకర్స్ మోటార్‌సైకిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న స్వర్ణ, పాన్‌బ్రోకర్ సంఘం

కేంద్రప్రభుత్వం బంగారంపై విధించిన ఎక్సైజ్ డ్యూటీకి వ్యతిరేకంగా పట్టణంలో స్వర్ణ, పాన్‌బ్రోకర్ సంఘం ఆధ్వర్యంలో 12వ తేదీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి బులియన్ గోల్డ్, సిల్వర్, డైమండ్ మర్చంట్ అసోసియేషన్ సభ్యుడు సోమిశెట్టి చెంచురామయ్య మాట్లాడుతూ ఈ బిల్లును గత ప్రభుత్వం ప్రవేశ పెట్టినప్పుడు వ్యతిరేకించిన భారతీయ జనతాపార్టీ మళ్లీ ఇప్పుడెలా ప్రవేశపెడుతోందని ప్రశ్నించారు. దీనివల్ల అనేకమంది స్వర్ణకార్మికులు రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వెంటనే ఈ పన్నుని రద్దు చేసి స్వర్ణ కార్మికులందరికీ న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు పాన్‌బ్రోకర్, జ్యూయలరీ, స్వర్ణకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాంప్రసాద్, కలువా రవి, నాయకులు రవికుమార్, పువ్వాడి చంద్ర, గొంట్ల వెంకటవంశీధర్, రవికుమార్, బ్రహ్మయ్య, ఆ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్పీకే దడ పుట్టించిన నెల్లూరు అరాచకశక్తులు

గల్పిక

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల ఉత్పత్తి కేంద్రమైన నెల్లూరు నగరం. జిల్లా పోలీస్ కార్యాలయం. ఎస్పీ ఛాంబర్‌లో పాత ఎస్పీ గజరావ్‌భూపాల్ నుండి కొత్త ఎస్పీగా విశాల్‌గున్నీ బాధ్యతలు తీసుకున్నారు. విశాల్ వుండి భూపాల్‌తో... సార్, నెల్లూరులో మీ అనుభవం ఎలా వుంది అని అడిగాడు. సార్, ఇక్కడ ఎంత తక్కువుగా పనిచేస్తే అంత ఎక్కువకాలం ఉండొచ్చన్నాడు గజరావ్ భూపాల్. ఏం మనుషులు ఇక్కడ అంత డేంజరా? అని విశాల్ ప్రశ్నించాడు. అందుకు గజరావ్ భూపాల్... ఇక్కడ మనుషులతో పెద్ద ఇబ్బందేం లేదు సార్, అయినా ఇది చెబితే అర్థమయ్యేది కాదు, అనుభవ పూర్వకంగా తెలుస్తుందిలే అని చెప్పి ఆయన వెళ్లిపోయాడు. తర్వాత ఎస్పీ విలేకరుల సమావేశం పెట్టాడు. నా పేరు విశాల్‌గున్నీ, నా సెల్ నెంబర్ 9440796300, ఎవరికి ఏ ఆపదొచ్చినా నాకు ఫోన్ చేయండి, ఎన్ని కిలోమీటర్ల దూరంలో వున్నా మీ ముందుంటా... అని చెప్పి విలేకరులను పంపించాడు. తర్వాత డిఎస్పీలు జె.వి.రాముడు, బాదేపల్లి శ్రీనివాస్, కోటారెడ్డి, చెంచురెడ్డి, విక్రమ్ శ్రీనివాసరావు తదితరులు ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు. ఎస్పీ వారితో... ఈ జిల్లాలో ఫ్యాక్షన్ ఏమన్నా ఉందా? అని అడిగాడు. అందుకు కోటారెడ్డి... ఇక్కడ రాజకీయ నాయకుల యాక్షన్ తప్పితే ఫ్యాక్షన్‌లాంటిదేమీ ఉండదన్సార్ అని చెప్పాడు. మరి రౌడీలు, గూండాలతో ప్రాబ్లమా అని విశాల్ అడిగాడు. దానికి బాదేపల్లి శ్రీనివాస్... ఇక్కడ రౌడీలకు సరిగ్గా చాకు పట్టుకోవడం కూడా చేతకాదు సార్, లాఠీతో ఒక్క దెబ్బ వేసామంటే ఒక్కొక్కడు లీటర్ పోసుకుంటాడు. రౌడీలు, గూండాలతో కూడా పెద్ద సమస్యలేదన్నాడు. వెంటనే విక్రమ్ శ్రీనివాస్... సార్, ఒక్క మాటలో చెప్పాలంటే ఇక్కడ మనుషులతో ఎటువంటి సమస్య లేదన్నాడు. మరి మనుషులతో కాకుండా ఇక్కడ పులులు, సింహాలతో ఏమన్నా ప్రాబ్లమా అని ఎస్పీ అడిగాడు. ఎవరితో ప్రాబ్లం అనేది ప్రాక్టికల్‌గా రేపొద్దున కల్లా మీరే తెలుసుకుంటారులే సార్ అని జె.వి.రాముడు చెప్పాడు. ఇందాక గజరావ్ భూపాల్ చూస్తే ఇలాగే మాట్లాడాడు, ఇప్పుడు వీళ్లు చూస్తుంటే అంతే డొంక తిరుగుడుగా మాట్లాడుతున్నారు, ఈ నెల్లూరు నీళ్లు తాగితే ఇంతేనా అని ఎస్పీ విశాల్ మనసులో అనుకున్నాడు. అంతలో మేయర్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జలీల్, బాలకోటేశ్వర రావు, దాసరి రాజేష్, నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు పూలబొకే లతో వచ్చి ఎస్పీని అభినందించారు. అజీజ్ తనను మేయర్‌గా పరిచయం చేసుకుంటూ... సార్, నెల్లూరులో మీరు ఎంతకాలమైనా ప్రశాంతంగా ఉండొచ్చు. మీ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం, దాని కోసం తగిన సిబ్బందిని ఇక్కడ, మీ క్యాంప్ ఆఫీసు వద్ద కూడా ఏర్పాటు చేశామన్నాడు. ఆ మాటలతో ఎస్పీ విశాల్‌కు తెగ ఆశ్చర్యమేసింది. ఆయన అజీజ్‌తో... మీరేంటి, రివర్స్‌లో మాట్లాడుతున్నారు, నా భద్రతను మీ మున్సిపాల్టీ వాళ్లు చూడడమేమిటి, ప్రజాప్రతినిధులుగా వున్న మీ భద్రతను మేం కదా చూడాల్సిందని అన్నాడు. అజీజ్ అందుకు... అన్ని జిల్లాల్లో పరిస్థితి వేరు, నెల్లూరులో వేరు సార్, ఇక్కడ మాత్రం మీ భద్రతా ఏర్పాట్లను మేమే చూస్తామన్నాడు. ఎస్పీ మనసులో ఈ నెల్లూరోళ్లేంటి... అంతా రివర్స్‌లో వున్నారని అనుకున్నాడు. తర్వాత ఆయనే... అలా సిటీలోకి వెళ్లొద్దాం పదండి... ఒకసారి సిటీ మీద అవగాహన వచ్చినట్లుంటుందని చెప్పి లేచాడు. ఎస్పీ కారులో మేయర్, కమిషనర్‌లు కూడా ఎక్కారు. వెనుక బండ్లలో ఇతర పోలీసు అధికారులు ఎక్కారు. ఎస్పీ వాహనం కరెక్ట్‌గా గేటు వద్దకు వచ్చేసరికి రోడ్డు మీద ట్రాఫిక్ జాం అయ్యింది. రోడ్డు మీద యాక్సిడెంట్ ఏమన్నా అయ్యిందా, ఇన్ని వాహనాలు ఆగిపోయాయని ఎస్పీ అడిగాడు. కమిషనర్ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుని అలాంటిదేమీ లేదు సార్, రిలయన్స్ మాల్‌లో షాపింగ్ చేసుకుని బయటకొచ్చిన ప్రయాణీకుడు చెయ్యెత్తి ఉంటాడు... అతనిని ఎక్కించుకోవడానికి పాతిక ఆటోలు రోడ్డుకు అడ్డుగా పెట్టి పోటీ పడుతుంటాయి. ఆ ప్రయాణీకుడు తొందరగా ఏదో ఒక ఆటోలో ఎక్కితే ట్రాఫిక్ క్లియర్ అవుతుంది. పెద్ద టైం ఏమీ పట్టదులే, అరగంటలో ట్రాఫిక్ కదులుతుందని కూల్‌గా చెప్పాడు. ఎస్పీకి లైట్‌గా ట్రాఫిక్ పరిస్థితి అర్థమైంది. కొద్దిసేపటికి ట్రాఫిక్ ముందుకు కదిలింది. ఎస్పీ వాహనం కెవిఆర్ పెట్రోల్‌బంకు వద్ద మలుపుతిరిగి ట్రంకురోడ్డు వైపు పోసాగింది. కస్తూరిదేవి స్కూల్ వద్దకు పోయేసరికి ఎస్పీ కారును ఓవర్‌టేక్ చేసుకుంటూ పది ఆటోలు వెళ్లాయి. అది గమనించిన ఎస్పీ విశాల్ డ్రైవర్‌తో... ఏం, ఎద్దులబండిలా తోలుతున్నావ్, స్పీడుగా పో అన్నాడు. అందుకు డ్రైవర్... ఇంకా ఎక్కడి స్పీడ్ సార్, వంద మీద పోతున్నామన్నాడు. ఎస్పీ అనుమానంగా స్పీడోమీటర్ వైపు చూశాడు. ముల్లు వంద కిలోమీటర్ల మీదే వుంది. ఆయన ఆశ్చర్యంగా... మరి మన కారును ఆటోలు ఓవర్‌టేక్ ఎలా చేయగలిగాయన్నాడు. అవి 120 కిలోమీటర్ల వేగంతో పోతుంటాయి సార్, కాబట్టే ఓవర్‌టేక్ చేసిపోతుంటాయని డ్రైవర్ చెప్పాడు. ఆటోలు 120 స్పీడ్‌తో పోవడమా... ఇంతకీ వాటికి ఏం ఇంజన్లు వాడుతుంటారని ఎస్పీ విశాల్ అడిగాడు. శ్రీహరికోట నుండి వదిలే రాకెట్లకు వాడే ఇంజన్లనే నెల్లూరులో ఆటోలకు కూడా వాడుతుంటారని అజీజ్ చెప్పాడు. అలా వాళ్లు మాట్లాడుకుంటూ ఓ గంటకు ఏ.సి సెంటర్ వద్దకు చేరుకున్నారు. కళ్లకు నల్లద్దాలు, నల్లఫ్యాంట్, నల్లషర్ట్ వేసుకుని 'సోగ్గాడే చిన్ని నాయనా' సినిమాలో నాగార్జున మాదిరిగా వున్న ఓ వ్యక్తిని ఎస్పీ ఆ సెంటర్‌లో చూశాడు. అతన్ని చూడగానే ఎస్పీ కారాపి... డిఎస్పీ వెంకటరాముడికి ఆ సోగ్గాడిని చూపిస్తూ... ఆ ఈవ్‌టీజర్‌ను తీసుకొచ్చి లోపల పడేయండి, ఇలాంటి పోకిరిలతోనే సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతుందని అన్నాడు. అతనిని చూసిన డిఎస్పీ నిర్ఘాంతపోయి... సార్, అతను ఈవ్‌టీజర్ కాదు, ఈ సిటీ మాజీ ఎమ్మెల్యే, స్టైల్ ఆఫ్ సింహపురి వివేకా. ఏజ్ 65 అని అన్నాడు. మరి యంగ్‌మెన్‌లా అలా తయ్యారయ్యాడేంటని ఎస్పీ అడిగాడు. ఆయన గెటప్, సెటప్ అంతా అలాగే వుంటుందిలే సార్ అని డిఎస్పీ కోటారెడ్డి చెప్పాడు. అంతలో ఎస్పీని గమనించిన వివేకా ఆయన వద్దకొచ్చి విష్ చేశాడు. ఎస్పీ విశాల్ వివేకాతో... సార్, మీరు గెటప్ మార్చండి, లేకపోతే పొరపాటున మావాళ్లు ఈవ్‌టీజింగ్ కేసులు బుక్ చేస్తారని సరదాగా అన్నాడు. అందుకు వివేకా... నేను అన్ని చోట్లకుపోయాను, మీరు ఆ పని చేసారంటే ఒకసారి జైలును కూడా చూసినట్లుంటుందన్నాడు. ఎస్పీ మనసులో ఈ మనిషి కూడా రివర్సేననుకున్నాడు. వివేకానే వుండి... సార్, పొద్దుపోయే టైమైంది, తొందరగా ఇంటికిపోండి, మేమంటే పాతోళ్లం, మా శరీరాలు మొద్దుబారిపోయాయి, నెల్లూరుకు మీరు కొత్త, తట్టుకోలేరని అన్నాడు. వివేకా మాటలకు ఎస్పీ ఆశ్చర్యంగా... ఏం, చీకటి పడితే మాఫియా డాన్‌లు చెలరేగిపోతారా... మావోయిస్టులు మందుపాతరలు పేలుస్తారా... అరాచకశక్తులు పేట్రేగిపోతాయా... ఎవరైనా రానివ్వండి... వాళ్ల తాట తీసి చేతిలో పెడతా అని విశాల్ ఆవేశంగా అన్నాడు. అందుకు వివేకా... అయ్యో, అలాంటివాళ్లతో సమస్యేముంది సార్, ఈ సిటీకి నేనే పెద్ద దాదాను, అలాంటి వాళ్లుంటే మీ దాకా ఎందుకు, నేనే ఒంటి చేత్తో మట్టి కరిపిస్తా... కాని ఇక్కడ మనుషులతో వచ్చిన ఇబ్బందేమీ లేదు, అయినా ఇది తీరిగ్గా మాట్లాడుకునే సమయం కాదు, తొందరగా ఇంటికెళ్లండని చెప్పి ఎస్పీని కారెక్కించాడు.

పొదలకూరు రోడ్డులోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలోకి ఎస్పీ వాహనం వెళ్లింది. ఎస్పీ క్యాంప్ కార్యాలయం నిండా పొగ అలుముకుంది. ఎస్పీ కారు దిగగానే ముగ్గురు వ్యక్తులు ఎస్పీకి రక్షణగా వచ్చారు. వాళ్లు కళ్లు మాత్రమే కనిపించేలా ఒళ్లంతా కప్పుకుని సియాచిన్ కొండల్లో సైనికుల మాదిరిగా వున్నారు. ఎస్పీకి వారిని చూసాక ఏమీ అర్థం కాలేదు... వారి చేతుల వైపు చూశాడు. ఆయన కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి, వారి చేతుల్లో గన్‌లకు బదులు ఫాగింగ్ మిషన్లు, ఎలక్ట్రిక్ బ్యాట్‌లు ఉన్నాయి. ఎస్పీ ఇక తట్టుకోలేక ఏమిటిదంతా... ఏం జరుగుతుందిక్కడ... నాకు తెలియాలి అని అరిచాడు. అప్పుడు అజీజ్... సార్, చెబుతాను వినండి, రౌడీలు, గూండాలు, మావోయిస్టులు, ఐసిస్ ఉగ్రవాదులు కూడా ఏమీ చేయలేని నెల్లూరు ప్రజలను నెల్లూరు కార్పొరేషన్ ముదురుదోమలు వణికిస్తాయి. నెల్లూరు బ్రాండ్ దోమలంటే ప్రపంచ దేశాలకు కూడా టెర్రర్. ఈ దోమలను అంతం చేసే శక్తి ఎవరికీ లేదు. ఈ దోమల వల్లే వేలాదిమంది ప్రజలు ఆసుపత్రులపాలవుతుండగా, చెన్నైలోని పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులు, నెల్లూరులో వందలాదిమంది డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఇతర సిబ్బంది ఉపాధి పొందుతున్నారు. ఈ దోమలు కరిచాయంటే ఒకేసారి నరకానికి పోకపోవచ్చు కాని, జీవితమంతా ఇక నరకంగానే ఉంటుంది. ముందుగానే మేం ఈ దోమల గురించి చెబితే మీరెక్కడ భయపడి వెళ్లిపోతారోనని ఇప్పుడు చెబుతున్నామన్నాడు. అంతలో కుయ్‌కుయ్ మంటూ లోపలకు 108 అంబులెన్స్ వచ్చింది. అందులో నుండి దిగిన సిబ్బంది అపస్మారక స్థితిలో వున్న ఓ వ్యక్తిని లోపలకు ఎక్కించారు. అతనికి ఏమైందని ఎస్పీ అంబులెన్స్ సిబ్బందిని అడిగాడు. ముదురుదోమలు కరిచి కోమాలోకి వెళ్లాడని వాళ్లు చెప్పారు. ఆ మాటకు ఎస్పీ అలాగే నోరు తెరిచాడు!

---

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికంగా కొద్ది ఒడుదుడుకులుంటాయి. వ్యాపార వర్గాలకు ఆశించిన వృద్ధి ఉండదు. వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆదాయం ఖర్చు సరిపోతుంటుంది. అయితే ఖర్చులు ఇబ్బంది కలిగించవు. అనుకున్న పనులను పట్టుదలతో సాధించుతారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. గాయాలు తగల వచ్చును. విద్యా ప్రగతి బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఇంట బయట చికాకులు సమస్యలు తొలగిపోతాయి. వ్యాపారాలు, వృత్తి లాభసాటిగా ఉంటుంది. ఆదాయం సంతృప్తికరం. ఆర్థిక ఒప్పందాలు కుదురుతాయి. చేపట్టిన పనులు విజయవంతం కాగలవు. సభలు సమావేశాలలో పాల్గొనడం గుర్తింపు గౌరవాలు పొందుతారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు. ఇతరులతో విభేదాలు సర్దుబాటు కాగలవు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

పలుకుబడి కొరకు, ఆడంబరాల కొరకు ఖర్చులు పెంచుకొంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం పెరుగుదల ఉంటుంది. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించగలవు. పరిశ్రమలు, రవాణా, సాంకేతిక వృత్తుల వారికి ఆర్థిక స్థితి ఆశావహంగా ఉంటుంది. పేచీలు, వివాదాలు సర్దుబాటు కాగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో పురోభివృద్ధి బాగుంటుంది. ఆదాయము తృప్తికరం. పెద్దమొత్తాలలో పెట్టుబడులు పెట్టడంగాని, ఇతరులకు పెద్దమొత్తాలు ఇవ్వడం గాని చేయవద్దు. విమర్శలకు ధీటుగా సమాధానాలు ఇవ్వడం, ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకొనకుండా మెలగాలి. పరీక్షలలో సంతృప్తికరంగా ముందుకు సాగుతారు. ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులకు ఆటంకాలుండినా ముందుకు సాగుతారు. రావలసిన బాకీలు, చెల్లించవలసిన బాకీలు పరిష్కారం కాగలవు. వృత్తి జీవనంలో అభివృద్ధి బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార వర్గాలకు అవరోధాలు కలిగి ఆదాయవృద్ధి స్వల్పంగా ఉంటుంది. విధి నిర్వహణలో ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలందు తొందరపాటు వద్దు. అనుకోని అదనపు ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. సంతోషకరమగు విషయాలు వినడం, ప్రశాంతత ఉండవచ్చును. వ్యాపారవర్గాలకు మంచి రాబడి అభివృద్ధి ఉంటుంది. షేర్లు పెట్టుబడులుపై ఆదాయం నిరుత్సాహ పరుస్తుంది. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. కొత్త వ్యాపారాలకు అవకాశాలు కలిసి వస్తాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 18.03.2016 నుండి
తేది. 24.03.2016 వరకు

ఈ వారం నందు మిధున కార్కటక సింహ కన్యా రాశులలో చంద్రుడు, సింహంలో గురురాహువులు, వృశ్చికంలో శని కుజులు, కుంభంలో శుక్ర కేతువులు, మీనంలో రవిబుధులు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 23 బుధవారం హోలీ పండుగ

### ముహూర్తములు

- తేది 24 గురువారం ఉదయం గంట 10.44 నుండి గంట 12.50 లోగా మిధునలగ్నమున వివాహము వ్యాపార గృహారంభములు.
- రాత్రి గంట 11.26 నుండి 1.32లోగా ధనుర్లగ్నమున వివాహ, గృహప్రవేశములు.

### ఫాల్గుణ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | దశమి | మ॥ గం.12.56వ॥ |
| తేది. 19 | శని | ఏకాదశి | మ॥ గం.12.36వ॥ |
| తేది. 20 | ఆది | ద్వాదశి | మ॥ గం.12.47వ॥ |
| తేది. 21 | సోమ | త్రయోదశి | మ॥ గం.1.28వ॥ |
| తేది. 22 | మంగళ | చతుర్దశి | సా॥ గం.2.39వ॥ |
| తేది. 23 | బుధ | పూర్ణిమ | సా॥ గం.4.14వ॥ |
| తేది. 24 | గురు | పాడ్యమి | సా॥ గం.6.11వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వ్యాపారవృద్ధి అవకాశాలు సన్నగిల్లుతాయి. బంధువులతో తగాదాలు, సమస్యలు రావచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావడం, కోర్టు కేసులు వాయిదా పడటం జరుగుతుంది. ఇతరుల విషయాలలో తలదూర్చి మాటలు పడవలసి రావచ్చును. విలువైన వస్తువులు, డబ్బు జాగ్రత్త పరచుకొనండి. విద్యాప్రగతి, కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కార్యసామర్థ్యం బాగుండి అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. మంచి వ్యాపారావకాశాలు, పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఉపాధి ఉద్యోగ పథకాలలో నిలద్రొక్కుకుంటారు. ఉద్యోగులకు ప్రశంసలు గుర్తింపు గౌరవాలుంటాయి. ప్రముఖులతో పరిచయాలు, విద్యాప్రగతి బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

బంధుమిత్రుల సహాయంతో అవసరాలు నెరవేరగలవు. కుటుంబంలో కొంత భిన్నాభిప్రాయాలు, విభేదాలు చోటుచేసికొంటాయి. బిడ్డల మూలంగా కొద్దిపాటి ఇబ్బందులుండవచ్చును. వృత్తి వ్యాపారాలు, ఉపాధి రంగాలలో అభివృద్ధి ఉంటుంది. అయినా కొన్ని అదనపు ఖర్చులుంటాయి. రావలసిన బాకీలు నిలబడిపోగలవు. ఇతరులను అతిగా నమ్మవద్దు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి ఉద్యోగాలలో మంచి మార్పులు కనిపించి అభివృద్ధికరంగా ఉంటుంది. వ్యాపారవర్గాలకు అవకాశాలు బాగుంటాయి. అనుకున్న పనులకు అనుకూల పరిస్థితులుండి, కార్యసాధకులు కాగలరు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. స్థిరాస్తుల పెంపుదలపై దృష్టి పెడుతారు. రావలసిన బాకీలు కొంతమేరకు లభిస్తాయి. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

భాగస్వామిక చర్చల్లో పురోగతి, పెట్టుబడి రంగాలలో అవకాశాలు దొరుకుతాయి. వృత్తి వ్యాపారాలు ఊపు అందుకొంటాయి. ఆదాయం పెరుగుతుంది. చేపట్టిన పనులు కొంత టెన్షన్ పెట్టినా అవకాశాలు కలసివచ్చి నెరవేరుతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరికే సమయమిది. కొత్త పరిచయాలు, బంధుత్వాలు బలపడగలవు. కొంత ఋణాలు తీరగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉపాధి పథకాలలో స్థిరపడతారు. వ్యాపార వర్గాలకు అవకాశాలు చేజారిపోవడం, సమస్యలు ఏర్పడటం జరుగుతుంది. కోర్టు వ్యవహారాలు అసంతృప్తిని కలిగిస్తాయి. బంధువుల నుండి విమర్శనలను ఎదుర్కొంటారు. అనుకున్న పనులకు ఆటంకాలు కలిగి కాలయాపన జరుగుతుంది. అదనపు ఖర్చులు పెరుగుతాయి. వస్తు నష్టం ఉంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు.

# కళ్యాణ వైభవం...!



ఇందుకూరుపేట మండలం జగదేవిపేట వాస్తవ్యులు పాముూరు సుధాకర్‌రెడ్డి - వసంతల కుమార్తె సుస్మిత - స్వరూప్‌రెడ్డి (నెల్లూరు రూరల్ ధనలక్ష్మీపురం వాస్తవ్యులు మోపూరు రాధాకృష్ణారెడ్డి - రజినిల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 11వ తేదీ ధనలక్ష్మీపురంలోని కెజికె కల్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు'లాయర్' శుభాకాంక్షలు.

# బంగారు వ్యాపారుల నమో టీ



కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో బంగారం మీద ఎక్సైజ్ డ్యూటీ విధించినందుకు నిరసనగా, జిజెఎఫ్ పిలుపు మేరకు ది ఏ.పి బులియన్, గోల్డ్, సిల్వర్ మరియు డైమండ్ మర్చంట్స్ ఆదేశానుసారం నెల్లూరుజిల్లా బులియన్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆ మేరకు ఈ నెల 12న స్థానిక బంగారు నగల హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు, స్వర్ణకారులు చిన్నబజారులో నమో టీ దుకాణాన్ని ప్రారంభించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలువురు, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బంగారువర్తకులకు తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ నిరవధిక సమ్మెకు మద్దతుగా త్వరలో జిల్లా వ్యాప్తంగా వస్త్ర దుకాణాలవారు ఒకరోజు బంద్ పాటిస్తారని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ది ఏ.పి బులియన్, గోల్డ్, సిల్వర్-డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ ఛీఫ్ ఆర్గనైజర్ శాంతిలాల్‌జైన్, వైస్ ప్రెసిడెంట్ దరిశి సురేష్‌బాబు, కోశాధికారి మణిలాల్‌జైన్, జెవిల్ సత్యం, డి.ప్రభాకర్, శంకర్‌లాల్‌జైన్, అలిమెలి సుబ్రహ్మణ్యం, ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్-పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పాబోలు నాగేశ్వరరావు, ట్రెజరర్ ముంజులూరు శ్రీనివాసులు, నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కందుకూరి చెంగయ్యఆచారితో పాటు పోట్లూరి రామకృష్ణ, దండపాణి సురేష్, ఖాజన వెంకటశేషయ్యఆచారి, వేలూరు రవీంద్ర, దువ్వూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కావలి కబుర్లు

# మద్యం వ్యాపారుల ఇష్టారాజ్యం

## • వ్యాపారులకు దాసోహమైన అధికారులు



కావలి పట్టణంలో మద్యం వ్యాపారుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. ముఖ్యంగా మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పి రేట్లు మొదలు కొని, బెల్టుషాపులు, సమయపాలన మొదలగు విషయాల్లో వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఎవరైనా ఇదేమిటని ప్రశ్నిస్తే తిరుగుబాటు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఒక దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా ఎంఆర్‌పి కంటే ఇరవై రూపాయలు అదనంగా మద్యం అమ్ముతుండగా, ఆ సమాచారాన్ని ఎక్సైజ్ అధికారులకు సైతం కొందరు తెలియజేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల విషయంలో ఖచ్చితంగా వ్యవహరిస్తున్నప్పటికీ, పల్లెల్లో బెల్టుషాపులు ఎత్తివేయాలని భావిస్తున్న తరుణంలో, ప్రస్తుతం మునుపటికంటే ఎక్కువగా బెల్టుషాపులు పెరుగుతున్నాయని, తద్వారా పచ్చగా వున్న పల్లెలు మద్యం ప్రభావంతో నాశనమవుతున్నాయని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. కావలి పట్టణంలో మద్యం దుకాణాలు ఏడు, బార్లు మరో ఏడు వుండగా, వీటి పరిధిలో రూరల్ మండలంలో ప్రతి గ్రామంలోనూ మూడు లేదా నాలుగు బెల్టుషాపులు వెలిసినట్లు గ్రామాల నుంచి ప్రజల విమర్శలు. ఒక్క మద్దూరుపాడు గ్రామంలోనే దాదాపు 8 బెల్ట్‌షాపులు వున్నట్లు తెలుస్తోంది. వీటికి నిబంధనలతో పని లేదు. వారి ఇష్టానుసారం వ్యవహరిస్తూ, ఏ సమయంలోనైనా మద్యం అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ బెల్టుషాపులతో అక్కడి ప్రజలు, ముఖ్యంగా మహిళలు భయభ్రాంతులవుతున్నారు. ఈ విషయాన్ని పలుసార్లు సంబంధిత ఎక్సైజ్ అధికారులకు విన్నవించినా చర్యలు శూన్యమని తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారుల తీరు ఇలా వుంటే, శాంతి భద్రతల దృష్ట్యా పోలీసు అధికారులు కొన్ని నిబంధనలు విధించినా, ఆ నిబంధనలను కూడా మద్యంషాపుల వారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల దాకా అమ్మకాలు జరుపుకోవాలని సూచించినా, ఉదయం 8 నుంచి అర్ధరాత్రి 12 దాకా కూడా మద్యం షాపులు తెరుస్తున్నారని తెలుస్తోంది. దీనిని నివారించేందుకు వెళ్ళిన పోలీసులపై కూడా అక్కడ దుకాణాల్లో పనిచేసే యువకులు తిరగబడుతున్నట్లు సమాచారం. అందుకు నిదర్శనంగా ఇటీవల ఒక మద్యం దుకాణంలో రాత్రి 10.45గంటల దాకా విక్రయాలు సాగిస్తుండగా, పోలీసులు వచ్చి దుకాణం మూసివేయాలని చెప్పడంతో గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఒకవేళ అలాంటి దుకాణాలవారిపై గట్టి చర్యలు తీసుకుంటే, యజమానులు అధికారుల వద్దకు వెళ్ళి సర్దుబాటు చేసుకుంటారని, అందువల్ల మధ్యలో పోలీసు కానిస్టేబుల్స్ నలిగిపోతున్నారని తెలుస్తోంది. ఎవరికి వారు నిజాయితీగా వ్యవహరిస్తే అన్నీ సక్రమంగానే వుంటాయని, అయితే కావలిలో ఆ పరిస్థితి లేదని, దీనికి కారణం అధికారులు వ్యాపారులకు దాసోహం కావడమేనని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ పరిస్థితులను పరిశీలించి మద్యం వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి ప్రజల్లో నెలకొన్న అపోహల్ని తొలగించాలని కోరుతున్నారు.

## బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు - ఎక్సైజ్ సిఐ

ఈ విషయాలపై ఎక్సైజ్ సిఐ బాబూరావును వివరణ కోరగా, గతంలో అక్రమంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నవారిపై కేసులు పెట్టామన్నారు. ఇటీవల రూరల్ మండలంలోని గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించే వారిని అందరినీ పిలిపించి ఉన్నతాధికారుల సమక్షంలో అవగాహన కల్పించామన్నారు. అయినప్పటికీ, ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కావలి పట్టణంలో నిబంధనల మేరకే సమయపాలన నిర్వహిస్తామన్నారు.

# పేదలకు కానుకగా ఉచిత ఇసుక

## • సర్వసభ్య సమావేశంలో దేశం నేతలు



పట్టణ తెలుగుదేశం పార్టీ సమావేశం ఈనెల 14న కావలిలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. కావలి టిడిపి అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో, వార్డుల్లో సమస్యల గురించి చర్చించారు. శివారు ప్రాంతాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించడం లేదని, దోమల బెడద ఎక్కువగా వుంటోందని, దోమల నిర్మూలనకు, పారిశుద్ధ్య పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని వర్గాలవారికీ ఇసుక ఉచితంగా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం ఎంతో హర్షదాయకమంటూ అభినందిస్తూ సమావేశంలో తీర్మానించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కాపులకు వెయ్యి కోట్లు కేటాయించి, వారి అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానించారు. కార్యకర్తలు స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని మలిశెట్టి వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. అనంతరం, వేదగిరి గుప్తా మాట్లాడుతూ, వార్డులలో జరిగిన సమావేశాల రిపోర్టు ఎప్పటికప్పుడు బాధ్యులకు చేరవేయాలని, అప్పుడు వాటి పరిష్కారానికి వీలవుతుందని అన్నారు. కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి వారిని ఉత్సాహపరచాలన్నారు. అనంతరం, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఆత్మకూరు బ్రహ్మయ్య, గుత్తికొండ కిషోర్, పద్మావతి శ్రీదేవి, గాదంశెట్టి వేణుగోపాల్, పోతుగంటి శ్రీకాంత్, వర్ధినేని వెంకటేశ్వర్లునాయుడు, ఉప్పు వెంకటస్వామి, గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి తదితరులు ఆయా వార్డుల్లో సమావేశాలు నిర్వహించినప్పుడు ఎదుర్కొన్న సమస్యలను, పరిష్కరించాల్సిన అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సమావేశంలో వడ్లమూడి వెంకటేశ్వర్లు, శివకుమార్, మేడికొండ సుకుమార్, షేక్‌బాబు, షేక్ హజరత్, పి.కృష్ణారావు, రామచంద్రరావు, కూరపాటి శ్రీనివాసులు, డి.వెంకట్రావు, కోటి లింగాచారి, కరిముల్లా, చలంచర్ల రాజా, డా.చంద్రశేఖర్, ఊసా వెంకట్రావు, పెనుమల్లి అశోక్, తటవర్తి వాసు, మొగిలి కల్లయ్య, మైనంపాటి జగదీష్, సన్నిబోయిన నారాయణ, షేక్ ఇబ్రహీం మరియు అనుబంధ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సభ్యులు, టిడిపి పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవానికీ సంక్షేమ పథకాలు అందాలి



కావలి నియోజకవర్గంలోని ప్రతి పేదవానికీ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందాలని కావలి పురపాలక ప్రతిపక్ష నేత కనుమర్లపూడి వెంకటనారాయణ అన్నారు. 12వ తేదీ స్థానిక వైఎస్సార్సీపి కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్సీపి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి పాలనలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను టిడిపి నెరవేర్చలేదన్నారు. హామీలు నెరవేర్చేవరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడతామన్నారు. అనంతరం, వైఎస్సార్సీపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుకుమార్‌రెడ్డి, కార్యదర్శి జి.ప్రసన్నాంజనేయులు, నాయకులు కె.శ్రీనివాసులు, ఎన్.వెంకటేశ్వర్‌రెడ్డి, పి.కామయ్య, ఏ.శివతో పాటు పలువురు కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రహ్మానందంకు అభినందనలు



ప్రముఖ సినీ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందంను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రచయితలు రాచపాళెం రఘు, కె.మురళీమోహన్‌రాజులు కలిసి రత్నమ్మ ఛారిటబుల్ ట్రస్టు తరపున అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినీ ప్రపంచంలో తన కంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సుస్థిరం చేసుకుని వెయ్యి మైలురాళ్ళను అధిగమించిన నటుడిగా ఇప్పటికీ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారని, హాస్యాన్ని పండిస్తున్న హాస్యబ్రహ్మ పద్మశ్రీ బ్రహ్మానందం సేవల్ని కొనియాడారు.

# నేతాజీలో ఫేర్‌వెల్ మీట్



శ్రీ నేతాజీ ఫైలట్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులు ఘన విజయం సాధించాలని కాంక్షిస్తూ సోమవారం పాఠశాలలో సరస్వతిదేవి పూజ, ఫేర్‌వెల్‌మీట్ కార్యక్రమం జరిగిందని నేతాజీ ఎద్యుకేషనల్ సొసైటి ప్రెసిడెంట్ వేదవతి సుబ్బారెడ్డి తెలిపారు. 10కి 10పాయింట్లు సాధించాలని విద్యార్థులకు సూచించారు. సాయంత్రం జరిగిన ఫేర్‌వెల్ మీట్‌లో 9, 10తరగతుల విద్యార్థులు పాల్గొని 10వ తరగతి విద్యార్థులు తాము ఏ విధంగా చదివి అభివృద్ధి చెందారో చెబుతూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, డైరెక్టర్ నరేంద్రరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న, వి.సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నువ్వింత .. నువ్వంత

(మొదటి పేజీ తరువాయి)

నువ్వు లక్షకోట్లు తిన్నావని అధికారపక్ష నేతలు జగన్ వైపు వేలెత్తి చూపితే... మీరు కాంట్రాక్ట్ పనుల్లో, ఇసుకలో, రాజధాని భూముల్లో ఇన్నేసి కోట్ల అవినీతికి పాల్పడ్డారంటూ ప్రతిపక్షం విమర్శనాస్త్రాలు సంధించింది. ఇరు పార్టీలు కూడా ఒకరి అవినీతిని ఒకరు బయటపెట్టుకోవడం, ఒకరి అవినీతి లెక్కలను మరొకరు చెప్పడంతోనే ఈ సమావేశాల పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. ప్రజల సమస్యలపై మాట్లాడదామనే స్పృహ ఏ ఒక్కరికీ తట్టనేలేదు.

ప్రతిపక్షనేతగా జగన్ ప్రశ్నించినప్పుడు సమాధానం చెప్పాలి, లేదంటే నీ ఆరోపణలు తప్పని తిప్పికొట్టాలి. అంతేగాని, నువ్వు దొంగవు, ఆర్థిక ఉగ్రవాదివి, లక్షకోట్లు తిన్నావు, ఇదుపులపాయ బంకర్లలో దాచుకున్నావ్... అంటూ సంబంధంలేని మాటలతో ఎదురు దాడి చేయడమేమిటి? జగన్ అక్రమాలు, అవినీతి ఆస్తులు వుంటే ఎలాగూ కేసులున్నాయి. ఈడి, సిబిఐ విచారణ జరుగుతుంది. దాని గురించి అధికారపార్టీ వాళ్లు కొత్తగా ప్రశ్నించాల్సింది, పరిశోధించాల్సిందేమీ లేదు. జగన్ అసెంబ్లీలో లేవనెత్తిన ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని చంద్రబాబు సవాల్ విసురుతున్నాడు. జగన్ మీద వచ్చిన ఆరోపణలను తెలుగుదేశం నాయకులు, కాంగ్రెస్ నాయకులు నిరూపించలేదు. సిబిఐ విచారించిందంతే! ఈరోజు ప్రతిపక్ష నాయకులు చేసే ప్రతి ఆరోపణను నిరూపించాలంటే వారి జీవితకాలం సరిపోదు. దానికి తగ్గ దర్యాప్తు సంస్థలు విచారణ చేపడితేనే నిజాలు బయటపడతాయి.

మొత్తానికి అసెంబ్లీని అడ్డదిడ్డంగా నడుపుతున్నారనేది పచ్చినిజం. గతంలో అసెంబ్లీ సమావేశాలను పోల్చి చూస్తే ఇవి అసెంబ్లీ సమావేశాలేనా? అని ఆవేదన కలుగుతోంది. ఒకర్నొకరు దూషించుకోవడం, ఒకరివైపు ఒకరు దొంగలని వేలుచూపించుకోవడం తప్పితే, ఈ సమావేశాలు ప్రజాసమస్యలపై చర్చకు ఏమన్నా వేదికవుతున్నాయా? ఇలాంటి సమావేశాలు జరిగితే ఏంటి? జరగకపోతే ఏంటి?

## కాలధర్మం

# భట్టారం పట్టాభిరామయ్య



నెల్లూరు, బాలాజీనగర్ నివాసి, తుమ్మగుంట ద్రావిడ బ్రాహ్మణ సంఘం సభ్యులు భట్టారం పట్టాభిరామయ్య ఈ నెల 10వ తేదీ రాత్రి కనుమూశారు. ఆయన వయసు 81 సంవత్సరాలు. ఆంధ్రా శబరిమలైగా పేరుగాంచిన విడవలూరు మండలంలోని తుమ్మగుంట అయ్యప్పస్వామికి ఆయన భక్తుడు. ఇక్కడ జరిగే కార్యక్రమాలకు విశేష ప్రాచుర్యం తెచ్చారు. తుమ్మగుంట క్షేత్రం మీద రచనలు కూడా వ్రాసారు. ఆయుర్వేద వైద్యంలోనూ ఆయనకు అనుభవం వుంది. 'లాయర్' అభిమాన పాఠకుడు. 'లాయర్' పత్రికలోనూ ఎన్నో వ్యాసాలు వ్రాసారు. ఆయన కుటుంబసభ్యుల కోరికమేరకు మోడరన్ ఐ క్లినిక్ వారు పట్టాభిరామయ్య నేత్రాలను సేకరించారు. పట్టాభిరామయ్య మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ఆదాయం పెంచడమే లక్ష్యం!



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆదాయాన్ని పెంచడమే తమ లక్ష్యమని ఆ బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన బ్యాంకు సమావేశ మందిరంలో నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలాఖరుకల్లా బ్యాంకును నష్టాల బాటలో నుండి లాభాల బాటలోకి మళ్లిస్తామన్నారు. 2013లో 87కోట్లు డిపాజిట్‌లు వుండగా 2016కు 164కోట్లకు పెంచామని, అప్పుడు 196కోట్ల ఋణాలివ్వగా, వాటిని 290కోట్లకు పెంచామన్నారు. తమ హయాంలోని 3 సంవత్సరాలలో 77వేల మందికి 44కోట్ల ఋణాలు ఇవ్వడం జరిగిందన్నారు. తమ పదవీకాలం ముగిసేనాటికి 500కోట్ల డిపాజిట్లను చేరుకునేది లక్ష్యమని, అలాగే 1000కోట్ల వ్యాపారం టార్గెట్‌గా పెట్టుకున్నామని చెప్పారు. డిపాజిట్ల సేకరణ, ఋణాలు ఇవ్వడంతో పాటు సొసైటీలో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎరువుల వ్యాపారం, ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు నెల్లూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి పేర్కొన్నారు. వైస్‌ఛైర్మెన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వ్యవసాయశాఖ జె.డి ఉమామహేశ్వరరావు, డిసిఓ నాగేశ్వరరావు తదితరులు ఈ సభకు హాజరయ్యారు.

# వ్యాపారుల ధర్నాకు ఆనం మద్దతు



ఏపి బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ వారు చేస్తున్న ధర్నాకు మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదిహేను రోజులుగా బంగారు వ్యాపారస్తులు ఉద్యమం చేస్తుంటే మోడీ ప్రభుత్వం చలనం లేకుండా ఉందని, దీనివల్ల దాదాపు 200కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, నరేంద్ర మనిలాల్, చంద్ర, మల్లి, చిన్ని శేఖర్, దరిశి సురేష్, మాధవాచారి, శాంతిలాల్, ముప్పసాని శ్రీనివాసులు, ఇలియాజ్, మునవ్వీర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఔట్.. ఇన్

(మొదటి పేజీ తరువాయి)

చౌదరి వివాదం పెరిగితే అది కేంద్రం మెడకే చుట్టుకుంటుంది. అందుకని కేబినెట్ నుండి సుజనాను తప్పించవచ్చనే సంకేతాలు తెలుగుదేశం అధిష్టానానికి అందినట్లు సమాచారం. సుజనాచౌదరిని తప్పిస్తే ఆయన స్థానంలో గుంటూరు ఎంపి గల్లా జయదేవ్‌ను తీసుకునే అవకాశాలు కనపడుతున్నాయి. జయదేవ్ పారిశ్రామికవేత్త అయినప్పటికి అప్పులు, వివాదాలు లేవు. ఎవరితోనూ పేచీలు లేవు. గల్లాది పెద్ద రాజకీయ కుటుంబం. చిత్తూరు, గుంటూరు జిల్లాలలో పార్టీకి ఉపయోగపడతారు. సినీహీరో మహేష్‌బాబుకు జయదేవ్ సొంత బావ. మొన్న పవన్‌కల్యాణ్‌ను వాడుకున్నట్లే భవిష్యత్‌లో తెలుగుదేశం పార్టీ కోసం మహేష్‌బాబును వాడుకోవడానికి అవకాశముంటుంది. కాబట్టే కేబినెట్‌లో సుజనాను తప్పిస్తే జయదేవ్‌నే తీసుకునే అవకాశముంది.

నరేంద్ర మోడీ తన కేబినెట్‌లోని సుజనాచౌదరిని తీసుకోవడానికి 2014లోనే నిరాకరించారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డప్పుడే చంద్రబాబు కేంద్రమంత్రి పదవుల కోసం అశోక్ గజపతిరాజు పేరుతో పాటు సుజనాచౌదరి పేరు కూడా ఇచ్చారు. అయితే అప్పటికే సుజనా బ్యాంకు బకాయిల చిట్టా మోడీ వద్దకు చేరి ఉండడంతో ఆయన సుజనాను కేబినెట్‌లోకి తీసుకోలేదు. మధ్యలో చంద్రబాబు నానా తంటాలు పడి ఇరికించారు. ఇప్పుడు మొహమాటానికి పోయి సుజనాను కేబినెట్‌లో కొనసాగిస్తే, ఇప్పటిదాకా తెచ్చుకున్న క్లీన్ ఇమేజంతా పోతుందని బీజేపీ నాయకత్వానికి భయం పట్టుకుంది. అందుకే కేబినెట్ ప్రక్షాళనకు పూనుకోనున్నట్లు తెలుస్తోంది.

# పాశంకు 'దేశం' వల?



రాష్ట్రంలో ప్రతిపక్షం నుండి అధికార పక్షంలోకి ఎమ్మెల్యేల వలసలు కొనసాగడం చూస్తున్నాం. అధికారం లేకుంటే ఆక్సిజన్ అందనట్లు బాధపడుతున్న ఓ 8మంది ఎమ్మెల్యేలు పచ్చ కండువాలు కప్పుకున్నారు. వైకాపా కంచుకోటల్లాంటి కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుండి ఎమ్మెల్యేలు పోయినా నెల్లూరుజిల్లా నుండి ఇంకా పోలేదు. నిన్న మొన్నటివరకు జగన్ వెనుక జిల్లా వైకాపా ఎమ్మెల్యేలు ఏడుమంది గట్టిగానే నిలబడివున్నారు.

అయితే ఈమధ్య గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పై అనుమానాలొస్తున్నాయి. అంతకుముందు పలుసార్లు పార్టీ మారుతాడని ఆయనపై వార్తలు రావడం, సునీల్ ఖండించడం జరిగింది. మొన్న వైకాపా వ్యవస్థాపక దినోత్సవం రోజున గూడూరులో ఆయన చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలను బలపడేలా చేశాయి. ఏ పార్టీలో ఎవరూ శాశ్వతం కాదని, నేను లేకున్నా గూడూరులో ఎల్లసిరి గోపాలరెడ్డి పార్టీని చూసుకుంటారని ఆయన మాట్లాడటం భవిష్యత్‌లో జరగబోయే పరిణామాలకు సంకేతంగా భావిస్తున్నారు.

సునీల్ తెలుగుదేశంకు పాతోడే! 1995లోనే ఆ పార్టీ తరపున గూడూరు మున్సిపల్ ఛైర్మెన్‌గా గెలిచాడు. ఆ తర్వాత పలుసార్లు అసెంబ్లీ సీటుకు ప్రయత్నించినప్పటికి బల్లి దుర్గాప్రసాద్ బలంగా ఉండటం వల్ల రాలేదు. జగన్ వైకాపా పెట్టాక తెలుగుదేశాన్ని వీడి ఈ పార్టీలో చేరాడు. ఎన్నికలకు ముందు నుండి గూడూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించాడు. 2014ఎన్నికల్లో గూడూరు వైకాపా సీటు కోసం పలువురు గట్టి ప్రయత్నాలు చేసినప్పటికి జగన్ పాశం సునీల్‌కే ఇచ్చాడు. తెలుగుదేశం నాయకులతో వున్న పాత పరిచయాలు, పార్టీతో వున్న గత సంబంధాల దృష్ట్యా సునీల్ త్వరలోనే మనసు మార్చుకుని ఆ పార్టీలోకి పోతాడని అనుమానిస్తున్నారు. పాశం మీద అనుమానాలు వచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పాశం సునీల్‌ను వెంటబెట్టుకుని జగన్‌ను కలిశారు. పాశం పార్టీ మారుతున్నాడనే అనుమానాలకు తెరదించడానికే ప్రసన్న ఆయనను జగన్‌తో మాట్లాడించాడు. దీని ద్వారా తాను వైకాపాను వదిలిపోవడం లేదన్న సిగ్నల్ ఇచ్చారు సునీల్. అయితే పార్టీని వదిలిన ఎమ్మెల్యేలలో చాలామంది ముందురోజు వరకు జగన్ పక్కన కనిపించిన వాళ్ళే. కాబట్టి ఎప్పుడు ఎవరు పార్టీ మారుతారో చెప్పడం కష్టమే!




# నీళ్ళదొంగలెవరు?



## • ఐఏబిలో తేలేనా?

ప్రతియేటా కృష్ణా, గోదావరి నదులకు వరదలొచ్చేవి. ఆ రెండు డెల్టాలలో నీళ్లుండేవి. ఆ డెల్టాల క్రింద సమృద్ధిగా పంటలు పండేవి. పెన్నానది మాత్రం ఎండుకునిపోయుండేది. శ్రీశైలం నీళ్లతో సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లను నింపుకుని పెన్నా డెల్టా క్రింద పంటలు పండించుకుంటుండేవాళ్ళం. చంద్రబాబు సీఎం అయితే కరువు కాటకాలు తప్పవనే ఒక ప్రచారం వుంది. అయితే, నెల్లూరు జిల్లాకు సంబంధించినంత వరకు ఆ ప్రచారం తప్పని గత యేడాది నవంబర్‌లో జిల్లాను ముంచెత్తిన వర్షాలు, వరదలు నిరూపించాయి. నవంబర్‌లో కురిసిన వర్షాలకు సోమశిల, కండ్లేరు డ్యాంలు నిండడంతో పాటు జిల్లా వ్యాప్తంగా నీటి లభ్యత పెరిగింది. సమృద్ధిగా నీళ్లుండడంతో ఈ యేడాది రెండుకార్ల పంటలకు ఢోకా లేదనుకుని రైతులు ఎంతో ఆనందంతో ఉన్నారు.

అయితే ప్రకృతి, భగవంతుడు కరుణించినా అధికారుల దయ లేకుంటే నోటిదాకా వచ్చిన నీళ్లు అందకుండా పోతాయని ఋజువయ్యింది. సోమశిల జలాశయంలో 22టిఎంసీల నీటి మాయం ఇప్పుడు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. వృధా కావడానికిగాని, దొంగలించుకుపోవడానికి గాని ఇవేమీ లీటరు, వంద లీటర్లు నీళ్లు కావు. 22టిఎంసీల నీళ్లు. ఖరీఫ్‌లో రెండున్నర లక్షల ఎకరాలలో వరిని పండించవచ్చు. ఇంత నీళ్లు ఏమయ్యాయనేదానిపై లెక్కలు తేలడం లేదు. మొదటి కారు పంటకు రిజర్వాయర్‌లలో వున్న నీటిని వాడింది కూడా తక్కువే! భారీగా వర్షాలు కురవడంతో బోర్లు, బావులు, చెరువుల్లోనూ నీళ్లు ఉండడంతో రిజర్వాయర్‌లలో నీళ్లను పెద్దగా వాడలేదు. మొదటి పంట వాడకాలకు పోను ఇప్పుడు లెక్కల ప్రకారం సోమశిలలో 56టీఎంసీల నీళ్లుండాలి. కాని లెక్కలు చూస్తే 33టీఎంసీలే వున్నాయి. కేవలం 2.50లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్ళిచ్చే అవకాశముంది. 56టీఎంసీలుండుంటే 4.40లక్షల ఎకరాల దాకా ఇవ్వొచ్చు. కాని ఇప్పుడు వున్న నీటితో రెండున్నర లక్షల ఎకరాలకు మించి ఇవ్వలేని పరిస్థితి.

ఇరిగేషన్ అధికారులే నీళ్లను అమ్ముకున్నారనే ఆరోపణలున్నాయి. కావలి, కనుపూరు కాలువలకు నీళ్లు ఎక్కువుగా వదిలారని విమర్శలొస్తున్నాయి. ఈ రెండు కాలువల మీద 35వేల దాకా మోటార్లున్నాయి. ఒక్కో మోటార్‌కు ఇంత అని డబ్బులు వసూలు చేసి కేటాయింపులకు మించి ఆ కాలువలకు నీళ్లు వదిలినట్లు సమాచారం. అలాగే చాలా వరకు నీళ్లు వృధా అయ్యాయి. సోమశిల నుండి వదిలిన నీళ్లు కాలువలకు పోగా ఎక్కువ భాగం సముద్రం పాలయ్యాయి. ముదివర్తిపాలెం పరిసర ప్రాంతాల రైతులు వృధాగా సముద్రం పాలవుతున్న నీళ్ళను చూసి నెత్తినోరు బాదుకోవడం కూడా జరిగింది. అధికారుల నిర్లక్ష్యానికి, నీటి నిర్వహణ లోపానికి వృధాగా పోతున్న నీటినే వాళ్లు ఉదాహరణగా పేర్కొన్నారు.

సోమశిలలో నీటి గల్లంతుపై రైతు సంఘాలు ఆందోళనకు దిగడంతో జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై వేగంగా స్పందించారు. రెవెన్యూ అధికారుల ద్వారా సోమశిల నీళ్ల లెక్కలు తెప్పించుకున్నారు. లెక్కల్లో అవకతవకలు గుర్తించి ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశారు. రెండో పంటకు నీటి లభ్యత, ఆయకట్టు విషయాలపై చర్చించేందుకు 20వ తేదీన సాగునీటి సలహాకమిటి సమావేశం పెట్టారు. ఈ నీళ్ల సమావేశంలో నిప్పులు రేగడం ఖాయం.

# శ్రీ సిటీలో బెల్జియం వాణిజ్య దూత



బెల్జియం దేశ వాణిజ్య దూత డా॥ బర్ట్ డీ గ్రూప్ ఈ నెల 17వ తేదీన తడ సమీపంలోని ప్రతిష్టాత్మకమైన పారిశ్రామికవాడ శ్రీసిటీని సందర్శించారు. శ్రీ సిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి, శ్రీసిటీలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వసతుల గురించి, సాధించిన ప్రగతిని గురించి వివరించారు. బెల్జియంకు చెందిన వెర్మీరన్ సంస్థ కూడా శ్రీసిటీలో ఉందని వివరించారు. శ్రీసిటీలో పారిశ్రామిక ప్రగతిని పరిశీలించి, తమ దేశం నుండి పెట్టుబడులు పెట్టడానికి గల అవకాశాలను పరిశీలించడానికి డాక్టర్ బర్ట్ డీ గ్రూప్ రావడం జరిగింది. ఈ క్రమంలో ఆయన తమ దేశానికి చెందిన వెర్మీరన్ సంస్థను సందర్శించారు. వికలాంగులకు ఉపయోగించే చక్రాల కుర్చీలను, కాలీబర్స్, పేషంట్ల మంచాలను ఈ సంస్థ తయారు చేస్తుంది. శ్రీసిటీలో ఏర్పాట్లు పట్ల డాక్టర్ బర్ట్ డీ గ్రూప్ తన సంతృప్తిని వ్యక్తం చేశారు.

# ఆరోగ్యంపై అవగాహన కోసం సైకిల్ యాత్ర




ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నేషనల్ మెడికో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఆరోగ్యం కోసం అవగాహన సైకిల్ యాత్ర'ను ఈ నెల 16వ తేదీన నెల్లూరులోని విఆర్ హైస్కూల్ మైదానంలో డా॥ భాస్కరరావు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. గుజరాత్, బీహార్, ఒరిసాలకు చెందిన మెడికల్ విద్యార్థులు సైకిల్ యాత్రలో 15వ తేదీ నెల్లూరు చేరుకుని ఇక్కడే బస చేశారు. 16వ తేదీ నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులతో కలిసి తిరుపతికి సైకిల్‌యాత్రను చేపట్టారు. విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఆధ్వర్యంలో వీరికి అల్పాహారం, బిస్కెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో యం.వి.సుబ్బారెడ్డి, డాక్టర్ ఓబుళరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అంకిరెడ్డి, బయ్యా శ్రీనివాసులు, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## • మాగుంట లే అవుట్

# అభివృద్ధికి వారధులు.. "కొత్త సారధులు"

## • అధ్యక్షుడిగా బట్రెడ్డి కృష్ణారెడ్డి, కార్యదర్శిగా దండమూడి హేమంత్‌కుమార్



"మాగుంట లే-అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్" నూతన కార్యవర్గం మార్చి 13వ తేదీన పదవీ బాధ్యతలు చేపట్టింది. గత పాలకవర్గానికి జనవరి 26వ తేదీతో 3సంవత్సరాల కాలపరిమితి ముగియడంతో కొత్త పాలకవర్గాన్ని సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మార్చి 13వ తేదీ ఆదివారం ఉదయం 11గంటల 45నిముషాలకు మాగుంట లే-అవుట్‌లోని బాలాజీ దేవాలయంలో నూతన పాలకవర్గం పదవీ బాధ్యతలను చేపట్టింది. కమిటి గౌరవాధ్యక్షులుగా ముడి జయరామిరెడ్డి, గౌరవ సలహాదారుగా మువ్వా బలరామయ్యనాయుడు, అధ్యక్షుడిగా బట్రెడ్డి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా కనుమూరు శ్రీనివాసులురెడ్డి, వట్టిగుంట చంద్రయ్యచౌదరి, గోళ్ళమూడి శ్రీధర్‌రెడ్డి, సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి బాధ్యతలు తీసుకోగా, కార్యదర్శిగా దండమూడి హేమంత్‌కుమార్, కోశాధికారిగా ముడి శోభన్‌రెడ్డిలు బాధ్యతలు చేపట్టారు. సంయుక్తకార్యదర్శులుగా కె.వెంక టేశ్వర్లు, వి.సురేష్, ఎ.సతీష్‌కుమార్‌రెడ్డి, ఎం.వి.కృష్ణారెడ్డి, సభ్యులుగా శివకుమార్‌రెడ్డి, జి.వెంగల్‌రెడ్డి, కె.రాజేంద్రకుమార్(సాయి), ఇందుకూరు శ్రీధర్‌రెడ్డి, ఇ.శ్రీధర్‌రెడ్డి, సి.రాఘవరెడ్డి, వై.మల్లిఖార్జునరెడ్డి, కె.శ్రీనివాసులు నాయుడు, సి.వి.ఎస్.సురేష్, టి.వెంకటేశ్వర్లు, ఎం.డి.ప్రసాద్‌రావు, ఎన్.మోహన్‌రావు, శివారెడ్డి, డి.సురేంద్రరెడ్డిలు శ్రీ వేంకటేశ్వర స్వామి సాక్షిగా తమ పదవులను అలంకరించారు. మాగుంట లే అవుట్ అభివృద్ధి కోసం సంసిద్ధమైన కొత్త సైన్యానికి 'లాయర్' ఆల్ ది బెస్ట్!

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com